

మనోహరం..
మల్లన్న కల్యాణం
- ముగిసిన కార్తీక దీపోత్సవం
- పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు

వివరాలు 8లో..

ఆంధ్రజ్యోతి

5 ANDHRAJYOTHY

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

ఆదివారం 9 నవంబరు 2025



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, వేదికపై ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, మరో మంత్రి నారాయణ, ఎంపీలు, వీపీఆర్, బీద మస్తాన్‌రావు, కలెక్టర్ తదితరులు

7.30 లక్షల ఎకరాలు...

73 టీఎంసీలు !

- రబీ సాగుకు నీటి కేటాయింపులు
- 15 నుంచి విడుదలకు ఐఏబీలో తీర్మానం
- ధాన్యం కొనుగోళ్లపై సుదీర్ఘ చర్చ
- సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం
- డీఆర్సీ సమావేశంలో మంత్రులు ఫరూక్, ఆనం, నారాయణ

నెల్లూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ రబీ సీజన్‌లో నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో సోమశిల, కండలేరు జలాశయాల కింద సుమారు 7.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశంలో నిర్ణయించారు. ఇందుకు 73 టీఎంసీలను కేటాయిస్తూ తీర్మానించారు. ఈనెల 15 నుంచి నీటిని విడుదల చేయాలన్న ఇరిగేషన్ అధికారుల ప్రతిపాదనను ఐఏబీలో ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అధ్యక్షతన శనివారం జిల్లా అభివృద్ధి సమీక్ష(డీఆర్సీ) సమావేశం నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశంలో అంతర్భాగంగానే ఐఏబీని కూడా నిర్వహించారు. ఈ సమావేశాలకు మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

తొలుత డీఆర్సీలో వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖలు, హౌసింగ్, జాతీయ రహదారులు, రవాణాశాఖపై సమీక్షించారు. అనంతరం ఇరిగేషన్‌శాఖపై సమీక్ష సందర్భంగానే సాగునీటి కేటాయింపులపై నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పలు సమస్యలను ప్రస్తావించారు. సోమశిల కింద 5,04,552 ఎకరాలకు 50.40 టీఎంసీలు, కండలేరు జలాశయం కింద 2,23,333 ఎకరాలకు 22.33 టీఎంసీల నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఒక టీఎంసీతో 10 వేల ఎకరాలను పండించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు సూచించారు. రాళ్లపాడు జలాశయానికి కూడా 1.50 టీఎంసీలను కేటాయించారు. కాగా ధాన్యం కొనుగోళ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ చక్రవర్తి, తూమాటి మాధవరావు, జేసీ ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ సమావేశ మందిరంలో జరిగిన డీఆర్సీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు

రైతుల సమస్యలు సీఎం దృష్టికి...

రాష్ట్రం మొత్తం రెండో పంట వేసినప్పుడు నెల్లూరులో మాత్రం మొదటి పంట ఉంటోందని, ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రం మొత్తం జరిగాక, జిల్లాలో వరికోతలు మొదలవుతుండడంతో రైతులకు అన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. గత సీజన్లో కూడా ఆలస్యంగా కొనుగో లు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారు చెప్పారు. ఇకపై జిల్లా రైతులకు అన్యాయం జరగకుండా నెల్లూరు జిల్లాలో ఎంత సాగు చేశారో.. ఆ దామాషా ప్రకారం ధాన్యం కొనుగోలు చేసేలా తీర్మానం చేయాలని కోరారు. ఈ విషయమై మంత్రి ఫరూక్ స్పందిస్తూ ఇది చాలా ముఖ్యమైన సమస్య అని, ఈ అంశాన్ని కేబినెట్‌లో ప్రస్తావించడంతోపాటు సీఎం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. తుఫాన్ నష్టాలపై నివేదికలను ఈనెల 10న జరిగే కేబినెట్ దృష్టికి తీసుకెళతామని మంత్రి ఆనం తెలిపారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. కాగా జాతీయ రహదారుల అధికారుల పనితీరుపై మంత్రి ఆనంతోపాటు ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగునీటి కేటాయింపుల వివరాలు

ప్రాంతం పేరు	ఎకరాలు	టీఎంసీలు
పెన్నార్ డెల్టా	2,15,552	21.55
కనుపూరు కాలువ	66,000	6.60.
కావలి కాలువ	1,00,000	10
ఉత్తర కాలువ	75,000	7.50
దక్షిణ కాలువ	48,000	4.80
కండలేరు లెఫ్ట్ కెనాల్	17,475	1.74
ఎస్ఎస్‌జీ(నెల్లూరు జిల్లా)	30,209	3.02
ఎస్ఎస్‌జీ(తిరుపతి జిల్లా)	1,75,649	17.56
మొత్తం	7,27,885	72.78

సర్వేపల్లి రిజర్వాయర్ తెగిపోతే పరిస్థితేమిటి..?



సర్వేపల్లి రిజర్వాయర్ ప్రమాదంలో ఉంది. కట్టలు బలహీనంగా ఉన్నాయి. ఇవి తెగిపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది. ఇక్కడ ఆధునికీకరణ పనులు చేపట్టాలి. కండలేరు స్పిల్‌వే వద్ద 50 వేల క్యూసెక్కులు విడుదల చేస్తే అనేక గ్రామాలు ముంపునకు గురవుతాయి. అక్కడ కాలువ నిర్మాణం జరగాలి.

- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి



ప్రతీ సీజన్‌లోనూ వరిసాగు చేస్తే ధాన్యాన్ని మార్కెటింగ్ చేసుకోవడం కష్టంగా ఉంటుంది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తే వారికి ఆదాయం వస్తుంది. మత్స్యకారులకు హైస్పీడ్ బోట్లను అందిస్తే పక్క రాష్ట్రాల చొరబాటుదారులను అడ్డుకునేందుకు వీలు కలుగుతుంది.

- వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ

ఆక్వా రైతులకు సబ్సిడీ ఇవ్వాలి



ఆక్వా రైతుల్లో కొంతమందికే విద్యుత్ సబ్సిడీ అందుతోంది. ఈ సమస్యను పరిష్కరించి అందరికీ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయంలో డ్రోన్లు పంపిణీ చేసిన విధంగానే ఆక్వాలో కూడా డ్రోన్లు పంపిణీ చేస్తే మ్యాన్‌పవర్ సమస్యను తగ్గించుకోవచ్చు.

- బీద మస్తాన్‌రావు, రాజ్యసభ సభ్యుడు

పశువుల దాణా ఇవ్వాలి



తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం పశువులకు దాణాను సరఫరా చేసింది. జిల్లాకు 430 టన్నులు వస్తే రూరల్ నియోజకవర్గంలో ఒక్క టన్ను కూడా పంపిణీ చేయలేదు. నేను జేడీకి ఫోన్ చేస్తే 3.50 టన్నులు ఇస్తామంటున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. కార్పొరేషన్ పరిధిలో కూడా పశువులు ఉన్నాయి. రూరల్‌ను ఒక మండలంగా కాకుండా నియోజకవర్గంగా చూడాలి.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

'అన్నదాత సుఖీభవ'ను అందించండి



కోవూరు నియోజకవర్గంలో చాలామందికి అన్నదాత సుఖీభవ నగదు అందలేదు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి త్వరగా వారికి నగదు జమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఆయకట్టు రైతులకు యూరియా ఇవ్వడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయి. అందరికీ యూరియా పంపిణీ చేసేలా చూడాలి.

- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

చెరువులు, కాలువలను బాగు చేయాలి



అదృష్టవశాత్తూ ఈ ఏడాది ఉదయగిరి నియోజకవర్గంలో చెరువులు నిండాయి. కానీ ఆ నీటిని సరఫరా చేయడానికి కాలువలు సరిగా లేవు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులు, కాలువలను బాగు చేయడంపై దృష్టి పెట్టాలి. గండిపాలెం రిజర్వాయర్‌కు ఇప్పటికీ హెడ్ ఆఫ్ అకౌంట్ లేదు.

- కాకర్ల సురేష్, ఉదయగిరి ఎమ్మెల్యే

సబ్సిడీతో విత్తనాలు అందించాలి



తుఫాన్ ప్రభావంతో కావలి నియోజకవర్గంలో చాలా చోట్ల నారుమళ్లు దెబ్బతిన్నాయి. అలాంటి రైతులను గుర్తించి సబ్సిడీతో విత్తనాలు అందించాలి. తుఫాన్ సమయంలో పశువులు చనిపోతే 30వ తేదీతో ఎన్యుమరేషన్ అయిపోయిందన్న కారణంతో రైతులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదు.

- దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

ఫిషరీస్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు..



ఫిషరీస్ బోట్లను రెన్యువల్ చేసే విషయంలో మత్స్యకారులను అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి అంటూ ఎఫ్‌డీవో బెదిరిస్తున్నారని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.ఈ సమస్యపై కలెక్టర్ దృష్టి పెట్టాలి.

- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

కొలువుల కౌశలం

- జిల్లాలో 1.28 లక్షలమంది నిరుద్యోగుల గుర్తింపు
- వారున్న చోటే ఉద్యోగాలు
- ఎంపిక కోసం నైపుణ్య పరీక్ష
- రేపు మోడల్ టెస్ట్ నిర్వహణ



నిరుద్యోగిని ఇంటర్వ్యూ చేస్తున్న అధికారి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం 'కౌశలం- వర్క్ ఫ్రం హోం' అనే పథకాన్ని అమలు చేస్తున్నది. విద్యార్హతల ఆధారంగా వారున్నచోటే ఉపాధి అవకాశాలు కల్పించేలా ఈ పథకం ఉపయోగపడనున్నది. జిల్లావ్యాప్తంగా నిరుద్యోగులను గుర్తింపునకు సర్వే జరిగింది. గ్రామవార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఈ సర్వే చేశారు. 18ఏళ్లు పైబడిన వారి నుంచి వివరాలు సేకరించారు. పదోతరగతి, ఆపై చదువులు చదివినవారి వివరాలను నమోదు చేశారు. ఏ ఉద్యోగం చేయగలరనే ఆసక్తిని కూడా కనుక్కున్నారు. అనంతరం వారి సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేశారు.కాగా నిరుద్యోగులే స్వయంగా ఉద్యోగ అవకాశాల కోసం వారి వివరాలను నమోదు చేసుకోనే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది. సచివాలయ ఉద్యోగులతో సంబంధం లేకుండా నేరుగా కౌశలం వెబ్‌సైట్‌లో వారు తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు.

● వృత్తి నైపుణ్య శిక్షణ

విద్యార్హత ఆధారంగా నిరుద్యోగులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గుర్తించి, అవసరమైన వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కాలంలో వారికి కొంతమొత్తాన్ని ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ, బీటెక్, డిప్లమో, ఐటీఐ చదివిన నిరుద్యోగులకు ప్రాథమికంగా నైపుణ్య పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో ప్రతిభను గుర్తించి, తగిన ఉద్యోగావకాశాలను అన్వేషిస్తారు. ప్రభుత్వం ద్వారా ఉచిత శిక్షణ ఇస్తారు. వారు ఇంటివద్దే ఉద్యోగం చేసేలా చర్యలు చేపడతారు.

● జిల్లాలో 1.28 లక్షలమంది...

ఈఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో జిల్లాలో తొలివిడత కౌశలం సర్వే జరిగింది. రెండో విడత జూలైలో ప్రారంభమై తాజాగా జరుగుతోంది. తొలి విడత సర్వేలో జిల్లాలో 1.28 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు గుర్తించారు. వారు నోటిమాటగా చెప్పారా, నిజంగా చెప్పారా? అనే అంశమై రెండో విడత సర్వే ప్రారంభమైంది. తొలి విడతలో గుర్తించిన 1.28లక్షల మంది సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్నారు. రెండో విడతలో 90187 మంది వివరాలను సంపూర్ణంగా నమోదు చేశారు. రెండో విడతలో 70.44 శాతం సర్వేపూర్తయింది.

● రేపు నమూనా పరీక్ష

నిరుద్యోగులకు నైపుణ్య పరీక్ష నిర్వహించడానికి ప్రతీ సచివాలయానికి వెబ్‌కెమరాను, హెడ్‌ఫోన్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. వీటిని పరీక్షించడానికి నమూనా నైపుణ్య పరీక్షను నిర్వహించనుంది. సోమవారం (రేపు) సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులతో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి నిరుద్యోగులకు నైపుణ్య పరీక్షను నిర్వహించనున్నారు.

సోమశిలకు 18,182 క్యూసెక్కుల నీరు

అనంతసాగరం నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 18,182 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. డ్యాంలో 71.851 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● కండలేరులో 58.51 టీఎంసీలు

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 58.51 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 640 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 850 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.11,85,751

వలేటివారిపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.11,85,751 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ.10,700, కుంకుమార్చనకు రూ.18,320, వివాహాల ద్వారా రూ.2 వేలు, తలనీలాల ద్వారా రూ.4,30,450, వాహన పూజలకు రూ.3,580, ప్రత్యేకదర్శనం టిక్కెట్లకు రూ. 4,03,700, రూము అద్దెలు రూ. 35,990, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,16,845, అన్నదానానికి రూ.4,39,120 ఆదాయం లభించినట్లు తెలిపారు.

రేపటి నుంచి సమ్మేటివ్ పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా నిర్వహణకు ఏర్పాట్లు
- 25 నాటికి మూల్యాంకనం పూర్తి
- 30న ప్రోగ్రెస్ కార్డుల జారీ



నెల్లూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్నీ యాజమాన్య పాఠశాలల్లో సమ్మేటివ్ అసెస్‌మెంట్-1(ఎస్ఏ-1) పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం నుంచి ఈనెల 19 వరకు ఈ పరీక్షలను నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్‌ను, మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆయా తేదీల్లో ఉదయం 8, 9, 10 తరగతులకు, మధ్యాహ్నం 6, 7 తరగతులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 10న తెలుగు, 11న హిందీ, 12న ఇంగ్లిష్, 13న గణితం, 14న జనరల్ సైన్స్-ఫిజికల్ సైన్స్, 15న బయలాజికల్ సైన్స్, 17న సోషల్ స్టడీస్, పరీక్షలు, ఓరియంటల్ పాఠశాలలకు చెందిన పరీక్షలు 18, 19వతేదీల్లో నిర్వహించనున్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు 11న తెలుగు, 12న ఇంగ్లిష్, 13న గణితం, 14న ఈవీఎస్ పరీక్షలను ప్రతిరోజూ ఉదయం పూట నిర్వహిస్తారు. 10వతరగతికి 100 మార్కులకు, ఇతర తరగతులకు 80 మార్కులకు జరిగే ఈ పరీక్షలకు అక్టోబరు వరకు జరిగిన సిలబస్‌పై ప్రశ్నలుంటాయని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు తెలిపారు.

● కట్టుదిట్టంగా నిర్వహణ

ఈ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా విద్యాశాఖ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు డీఈవో తెలిపారు. 1 నుంచి 5వతరగతి ప్రశ్నపత్రాలను క్లస్టర్ కాంప్లెక్స్‌లలో, 6 నుంచి 10వతరగతి వరకు ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీలలో భద్రపరుస్తారన్నారు. వీటి పంపిణీ కోసం ఎమ్మార్సీ స్థాయిలో ఎంఈవో-1, ఎంఈవో-2, ఒక ప్రధానోపాధ్యాయుడితోపాటు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశామన్నారు. క్లస్టర్‌స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, సీనియర్ స్కూల్ అసిస్టెంట్, ఒక రిసోర్స్ పర్సన్‌తో కమిటీ పనిచేస్తుందని ఆయన వివరించారు. ప్రతి సెషన్ ప్రారంభానికి గంట ముందుగా మాత్రమే ప్రశ్నపత్రాలు పాఠశాలలకు అందచేస్తారన్నారు. సమాధాన మూల్యాంకనం నవంబరు 25 నాటికి పూర్తి చేసి మార్కులను లీప్‌యాప్‌లో నమోదు చేయాలని డీఈవో తెలిపారు. నవంబరు 30 నాటికి ప్రోగ్రెస్ కార్డులను జారీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

రేపు జొన్నవాడ ఆలయంలో లక్ష దీపోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ఈ నెల 10వ తేదీన కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు లక్ష దీపోత్సవానికి తరలివచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11,520
వెండి కిలో ధర	రూ. 1,51,600
వెండి ఒక గ్రాము	రూ. 157.60

కల్యాణం..కమనీయం!



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో దేవేరులతో శ్రీవారి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీవారికి అభిషేకాలు నిర్వహించి చందనాలంకార సేవ చేశారు. భక్తులు శ్రీవారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవ, తిరుచ్చి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామికి క్షేత్రోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని ద ర్శించుకున్నారు. భక్తులకు ప్రసాదాలతో పాటు అన్న ప్రసాదం చేసినట్లు ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న బ్రహ్మారెడ్డి

రాపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి నిత్యాన్న దాన పథకానికి సిద్ధవరం గ్రామ వాస్తవ్యులు ఏటూరి బ్రహ్మారెడ్డి, జయశ్రీ రెడ్డి దంపతులు రూ. 1 లక్షా 116 విరాళం అందించారు. దాతలకు మూడు ఆలయాలలో ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాటు చేసి శ్రీవార్ల దర్శనం, శేష వస్త్ర, ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

కొత్తూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఇందుకూరుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులకు శుక్రవారం నెల్లూరు సెయింట్ జాన్స్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి వృత్తి విద్యా కోర్సుల నైపుణ్యాల పోటీల్లో మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ ట్రేడ్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించి, ఈనెల 14న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను శనివారం మండల విద్యాశాఖాధికారి-2 సునీల్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ మల్లికార్జున, ఒకేషనల్ సిబ్బంది పీ కమలాకర్, వై మునేంద్ర, సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.

ఈసారైనా.. గట్టెక్కేనా?

- నిండుకుండల్లా సోమశిల, కండలేరు
- భారీ వర్షాలకు నిండిన చెరువులు
- రబీ సాగుకు రైతుల సమాయత్తం

పొదలకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. సాగునీటికి ఢోకా లేకున్నా రైతుల్లో రబీ సాగుపై అనేక సందేహాలున్నాయి. పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో దిగుబడిని పెంపొందించు కునేందుకు నూతన వరి వంగడాల కోసం కసరత్తు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఉన్న బంధువుల ద్వారా కూడా సమాచారం సేకరించి విత్తన ఎంపికపై ఆరా తీస్తున్నారు. ఎకరాకు 4 నుంచి 5పుట్ల ధాన్యం దిగుబడి అయితేనే పెట్టుబడులు తిరిగి దక్కించు కోగలమనే భావనలో ఉన్నారు. ఎడగారులో వరిసాగు చేసిన రైతులు ధరల్లేక నష్టపో యారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 2.5 పుట్లు కూడా దిగుబడి కాలేదు. గ్రామాల్లో వరి నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కేఎన్ఎం 1688, ఆర్ఎస్ఆర్ 15048 రకాలను పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తు న్నారు. ఈ నేపథ్యంలోనే విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కేఎన్ఎం 7715 రకాన్ని సేకరించేందుకు మండలంలోని తాటిపర్తి, నల్లపాలెం తదితర పెన్నార్ డెల్టా ప్రాంతాల రైతులు తిగుతున్నారు. అలాగే కేఎన్ఎం 12510 గురించి కూడా సమాచారం సేకరిస్తున్నారు. ఈ రకం విత్తనాలు దిగుబడి అధికంగా ఉంటుందని, అయితే సాధారణ రకం కంటే 20రోజులు ఆలస్యంగా కోతలకు వస్తుందంటున్నారు. ఎకరానికి 4.5 నుంచి 5 పుట్ల ధాన్యం దిగుబడి అవుతుందనే ప్రచారం ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

● యూరియా కార్డుల పంపిణీ

మండలంలోని 10వేల యూరియా కార్డులను అందజేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అన్నీ రైతు సేవా కేంద్రాలకు యూరియాను దిగుబడి చేసుకున్నామని, మొదటి కోటా కింద బస్తాలను అందజేస్తామని అంటున్నారు. అయితే చాలా



నిండుకుండలా ఉన్న కండలేరు జలాశయం

మంది రైతులు తీరవజాస్తి ఆయకట్టు కింద రబీలో వరిసాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగి యూరియా లభ్యం కాక సమస్యలు ఎదుర్కొనే కంటే సాగు చేయకపోవడమే మేలనే ఆలోచనలో ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో బస్తా యూరియా రూ.400 చెల్లించినా లభ్యం కావడంలేదని వాపోతున్నారు. రబీలో మండలంలో 18 వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

వరద బాధితులను ఆదుకుందాం!

కొడవలూరు సీఐ సురేంద్రబాబు



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ, ట్రస్టు నిర్వాహకులు

విడవలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో మొంథా తుపాను బాధితులకు తమవంతుగా చేయూతనందించాలని కొడవలూరు సీఐ సురేంద్రబాబు పిలుపునిచ్చారు. పార్లపల్లి, బుసగాడిపాళెంలో వరద బాధితులకు గొల్లపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శనివారం ఆయన అందజేశారు. తుఫాను కారణంగా చాలా మంది నిరుపేదలు సర్వస్వం కోల్పోయారని, అలాంటి నిర్భాగ్యులకు ట్రస్టుద్వారా సాయం చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటివరకు ఈ ట్రస్టు ద్వారా నియోజవర్గంలోని 5 గ్రామాల్లో సుమారు 190 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మానవతావాదులు తుఫాను బాధితులను ఆదుకోవడానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జ్యోతి, ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఏకూరు సుధీర్‌గౌడ్, నాయకులు పూండ్ల ఏసోబు, కాగుటూరి దేవకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి అంబళం పూజ



భజన గీతాలు ఆలపిస్తున్న అయ్యప్ప భక్తులు

పొదలకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయంలో వెలసిన అయ్య ప్పస్వామి 48వ అంబలం పూజా మహోత్సవాన్ని శనివారం అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అ య్యప్ప భక్త బృందం సభ్యులు రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో స్వామివారి మం డపాన్ని అలంకరించారు. గురుస్వాముల భ జనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పడిపూజ అనంతరం తీర్థ ప్రసాదాలు పంపి ణీ చేశారు. గురుస్వాములను ఘనంగా సత్క రించారు. అయ్యప్ప భక్త బృందం సభ్యులు మాట్లాడుతూ గత 47 ఏళ్లుగా అంబళ పూజను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆది వా రం మధ్యాహ్నం అన్నదానం, శ్రీధర్మశాస్త్ర స్వా మి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించను న్నారు. మాలాధారణ స్వాములు అయ్యప్ప భక్తబృందం పాల్గొన్నారు.

సీపీఎం నేత జొన్నలగడ్డకు సతీ వియోగం

- డెంగ్యూ జరంతో చికిత్స పొందుతూ మృతి
- మృతురాలి నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నకన్వీనర్ విజయ



నాగమ్మ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): బుచ్చిరెడ్డి పాళెంకు చెందిన జిల్లా సీపీ ఎం నేత జొన్నలగడ్డ వెంక మ రాజుకు శనివారం సతీ వియోగం కలిగింది. వెంకమరాజు భార్య నాగమ్మ (56) డెంగ్యూ జ్వరంతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందా రు. బుచ్చిరెడ్డిపాళెంలో అంత్యక్రియలు నిర్వహించా రు. నాగమ్మ మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. అంత్యక్రియల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, గోగుల శ్రీనివాసులు, సీపీఎం, సీఐటీయూ మండల నాయకులు, పలు పార్టీల నాయకులు పాల్గొ న్నారు. వెంకమరాజును, కుటుంబసభ్యులను పరామర్శించారు.

● మృతురాలి నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు

పుట్టెడు దుఃఖంలోనూ భర్త వెంకమరాజు నాగమ్మ నేత్రాలను దానం చేయడం విశేషం. ఈ మేరకు సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ పి. విజయ నెల్లూరు ప్రభుత్వాసుపత్రి సిబ్బందితో కలిసి నేత్రాలను సేకరించారు. హైదరాబాదులోని ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి నేత్రాలను తరలించినట్లు వెంకమరాజు తెలిపారు.

బోరు పని చేయదు.. తాగునీరు రాదు!

- ఖాళీ బిందెలతో చౌకిచర్ల గిరిజనుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

విడవలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోటారు బోర్లు చెడిపోవడంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండలపరిధిలోని చౌకిచర్ల గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది తమ గోడు పట్టించుకోవటం లేదని శనివారం ఖాళీ బిందెలతో కాలనీలో వారు నిరసన తెలిపారు. కాలనీలో సుమారు 24 కుటుంబాలు ఉన్నాయని, తాగునీటి కోసం పంచాయతీ మోటారుపైనే ఆధారపడ్డామన్నారు. అయితే నాలుగు రోజులుగా బోర్లు మరమ్మతులకు గురవడం వల్ల తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా మరమ్మతులు చేస్తామంటూనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకుడు సమాధి శ్రీనివాసులు ఇంటిలో తాగునీరు పట్టుకుంటున్నామని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కాలనీలో బోర్లు మరమ్మతులు చేయాలని వారు కోరారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకపోవడం అన్యాయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నేతలు

కావలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పుతో దాడి చేసిన వారిని ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. మల్లి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై చెప్పుతో దాడి చేసిన రాకేష్ శర్మను బీజేపీ ప్రభుత్వం కాపాడడం భారత ప్రజలకు అవమానకరమన్నారు. చట్టం తనపని తాను చేసుకుని పోతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెపుతూ అరెస్టుకు అడ్డుపడటం చూస్తే దళితులను అవమానించటమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దాడిని ఖండించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా దాడి చేసిన రాకేష్‌శర్మను అరెస్ట్ చేసి న్యాయమూర్తులకు న్యాయం జరుగుతోందని నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నరసింహారావు, జరుగుమల్లి విజయరత్నం, శ్రీను, జెడ్డా వాసు, బాలక్రిష్ణ, రమణయ్య, సతీష్‌లు పాల్గొన్నారు.

వెంటాడుతున్న పంచాయతీ కార్యదర్శుల కొరత!

● సేవలందక ఇబ్బందులు పడుతున్న ప్రజలు ● పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



వలేటివారిపాలెం గ్రామ సచివాలయం

వలేటివారిపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. దీంతో ఆయా పంచాయతీల్లో పాలన కుంటుపడుతోంది. ఆ పంచాయతీల్లో సేవలందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా అయ్యవారిపల్లె, చుండి, బడేవారిపాలెం, శాఖవరం, శామీరపాలెం, కళ్లవళ్ల పోలినేనిపాలెం, నేకునాంపురం గ్రామ పంచాయతీలకు మాత్రమే పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన 13 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. ఒక్కొక్క పంచాయతీకి ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఉండాల్సి ఉండగా 21 గ్రామ పంచాయతీలకు 8 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. దీంతో ఒక్కో కార్యదర్శి 2, 3 పంచాయతీ బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఒక్కడ ఉన్న పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో నియమితులైన పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరకుండానే అధికారపార్టీ నాయకుల సిఫార్సు మేరకు వాళ్లకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. దీంతో మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఏర్పడింది. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు లేక పనులు సకాలంలో కావడంలేదని ప్రజలు వాపోతున్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వెళ్లితే పంచాయతీ కార్యదర్శులు లేరని చెప్తుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నామని పలువురు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు నియామకంలో ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారని ప్రజ లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులను నియమించి సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మిక చట్టాలు ఉల్లంఘించడం సరికాదు

● ఏఐఎఫ్‌బీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



విశాఖలో నిర్వహించే ఏఐఎఫ్‌బీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ బ్రిటీష ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చేందుకు మంత్రి మండలి తీర్మానం చేయడం దారుణమని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.సుందరరామరాజు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పార్టీ ఈ నెల 23, 24వ తేదీలలో విశాఖలో నిర్వహించే రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సుందరరామరాజు మాట్లాడుతూ ఏఐఎఫ్‌బీ పార్టీ ప్లీనరీ సమావేశాలు విశాఖ పట్టణంలోని కుర్మనపాలెం ఆవాస్‌ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలలో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు గతంలో ఉన్న 8 గంటల పని విధానాలను 10 గంటలకు పెంచుతూ మంత్రి మండలి తీర్మానం చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. కార్మిక చట్టాలను పాలీష్ చేసి వాటికి వ్యతిరేకమైన పద్ధతులు అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా అధికారంలో, ప్రతిపక్షంలో ఉండి కార్మికులపై ఈ విధానాన్ని బలవంతంగా రుద్దుతున్నాయన్నారు. జీఎస్టీ ధరలు పెంచి ఇప్పుడు తగ్గించామని ఉత్సవాలు జరుపుకోవడం సరికాదన్నారు. జిల్లాలో కరేడు భూముల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టీ.రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, టీయూసీసీ జిల్లా కన్వీనర్ కావలి ఏసు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



తల్లికి తలకొరివి పెడుతున్న కుమార్తె లలిత

కావలి రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచం పట్టిన తల్లి దేవబత్తిన భ్రమరాంబ(79) మృతి చెందగా ఆమెకు తన కుమార్తె తలకొరివి పెట్టి దహన సంస్కారాలు చేసిన ఘటన శనివారం కావలి మండలం చౌదరిపాళెంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. చౌదరిపాళెంకు చెందిన దేవబత్తిన పేరయ్య, భ్రమరాంబ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ కుమారులు లేరన్న బెంగను వదిలి ముగ్గురు కుమార్తెలకు విద్యాబుద్ధులు నేర్పి వివాహాలు చేశారు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఉన్న తల్లి మృతి చెందడంతో కుమార్తెలు పుట్టింటికి చేరారు. ఒంగోలులో ఉంటున్న ఆమె చిన్నకుమార్తె నల్లూరి లలిత తల్లికి తలకొరివి పెట్టి దహనసంస్కారాలు చేసి ఆ తల్లికి కుమారుడు లేని లోటును తీర్చి ఆదర్శంగా నిలిచింది.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

మర్రిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి వనం చెన్నకృష్ణయ్య(65) ఆత్మహత్య పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కుంటనిళ్లపాడులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబంలో ఏర్పడిన వివాదాల నేపథ్యంలో మనస్తాపంతో తన ఇంట్లో ఉన్న పురుగు మందు తాగడంతో గమనించిన కుంటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటీన బద్వేలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. దీంతో పోలీసు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కలువాయి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపూరుపల్లి రామాలయం, వెరుబొట్లపల్లి కలకంటమ్మ ఆలయాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్థుల సమాచారం మేరకు... కనుపూరుపల్లి రామాలయంలో శుక్రవారం రాత్రి తలుపులు పగలగొట్టి గర్భగుడిలో ఉన్న అమ్మవారి తాళిబొట్లు, హుండీ ఎత్తుకెళ్లారు. వెరుబొట్లపల్లి కలకంటమ్మ ఆలయంలో అమ్మవారి కళ్లకు అలంకరించే వెండి వస్తువులతో పాటు హుండీని తీసుకెళ్లారు. సంఘటనా స్థలాలను ఎస్ఐ కోటయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అకారణంగా ఓ వ్యక్తి మీద దాడి చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట గొర్రెలమిట్ట ప్రాంతంలో పెయింటర్ ఎస్కే ఖాదర్‌బాషా నివసిస్తున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం. గురువారం రాత్రి ఆయన పరమేశ్వరినగర్ సమీపంలోని మద్యం దుకాణంలో చాంద్‌బాషా, గౌస్‌బాషా అనే వ్యక్తులతో మాట్లాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వారితో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. ఏమి లేదని చెప్పడంతో వెళ్లిపోయిన ఆ వ్యక్తి కొద్ది సేపటి తర్వాత మరలా వచ్చి ఖాదర్‌బాషాపై దాడి చేశాడు. అంతటితో ఆగక రాయితో ఖాదర్‌పై దాడి చేశాడు. తలకు గాయమైన ఖాదర్‌బాషా జీజీహెచ్‌లో చేరి శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు



బస్సుకున్న అత్యవసర ద్వారాలను పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్డు పక్కన నిలిపి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో శుక్రవారం అర్ధరాత్రి సౌత్‌నార్త్ ట్రాఫిక్ పోలీసులు తనఖీలు చేపట్టారు. ట్రావెల్స్ బస్సులకు పర్మిట్, ఎఫ్‌సీ, ఫైర్, ఎగ్జిట్ డోర్ వద్ద సీట్ల ఏర్పాటు... ఇలా అనేక అంశాలను పరిశీలించారు. ప్రధానంగా డ్రైవ ర్లు మద్యం సేవించారా అన్నదానిపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వ హించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకటరెడ్డి మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సాగరం చెరువు

అలుగు గోడ ధ్వంసం

- గండి కొట్టడంతో వృథాగా పోతున్న నీరు



అలుగు కాంక్రీట్ గోడను ధ్వంసం చేయడంతో వృథాగా పోతున్న నీరు

అనంతసాగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతసాగరం చెరువు అలుగుకు నిర్మించిన కాంక్రీట్ గోడను ధ్వంసం చేసి మూడు చోట్ల గండి కొట్టడడంతో జలాలు వృథాగా పోతున్న విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. అయితే గండ్లు ఎవరూ కొట్టారు అనే విషయంపై సందిగ్ధం నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు సాగరం చెరువుకు నీరు చేరింది. చెరువు నిండితే అలుగు నుంచి అదనపు నీరు పారేలా గతంలో పనులు చేశారు. అయితే అలుగు గోడకు మూడు చోట్ల గండ్లు కొట్టడంతో చెరువుకు చేరిన నీరు వృథాగాపోతోంది. వాస్తవానికి అలుగు ప్రాంతం వైపు జన సంచారం ఉండదు. దీంతో దానిని ఎప్పుడు ధ్వంసం చేశారో తెలియదు. కానీ చెరువు నిండితే లోతట్టున ఉన్న పాతాళపల్లి, గోవిందమ్మపల్లి, ముస్తాపురం, మంగుపల్లి ప్రాంతాల్లో పొలాలు మునకకు గురవుతుంటాయని, దీంతో గుర్తుతెలియని రైతులు ఈ గండ్లు కొట్టివుంటారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 600



కనుల పండువగా ప్రాకారోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలస్థానేశ్వర ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి శివపార్వతుల ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అర్చనలు జరిగాయి. మూలవర్లకు భస్మాభిషేకం భక్తిశ్రద్ధలతో జరిగింది. సాయంత్రం విశేష పూలంగిసేవ జరిగింది. ఆదివారం ఉదయం 10గంటలకు లక్ష బిల్వార్చన జరుగుతుందని, భక్తులు అందరూ తరలిరావాలని ఈవో వెంకట శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నేడు లక్ష బిల్వార్చన

కార్యకర్తలు యాక్టివ్‌గా ఉంటే తిరుగులేదు

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం యాక్టివ్‌గా ఉంటే రాష్ట్రంలో టీడీపీకి తిరుగులేదని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. శనివారం నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రజలకు నేతలు, కార్యకర్తలు ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. అలాగే ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో నాయకులు కార్యకర్తలను కలుపుకుని అభివృద్ధి కార్యక్రమాల కు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతరెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణానికి సహకరించండి

● జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్‌కు ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, ప్రశాంతి రెడ్డి విన్నపం



మంత్రి ఫరూక్‌కు పుష్పగుచ్ఛం అందచేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : నగరంలో కొండాయపాళెం, బీవీ నగర్ రైల్వే గేట్ల వద్ద, చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై వంతెనల నిర్మాణానికి చేయూతనివ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కోరారు. శనివారం నెల్లూరుకు వచ్చిన మంత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి భూసేకరణ జరుగుతోందని చెప్పారు. అలాగే చింతారెడ్డిపాళెం జంక్షన్‌లో ఫ్లైవోవర్ నిర్మాణానికి కూడా మంత్రి నారాయణ, ఎంపీ వీపీఆర్ చొరవతో ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ మూడు వంతెనల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని మంత్రిని కోరారు. కాగా, మంత్రి ఫరూక్‌ను ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కలిసి సత్కరించారు. రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

బ్రిడ్జి నిర్మాణానికి నిధులివ్వండి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలో ఉప్పుటేరు-పల్లిపాళెం బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూ రు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్‌ఎండీ ఫరూక్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఆమె, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి శనివారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రితో భేటీ అయ్యారు. ఉప్పుటేరు వంతెన నిర్మాణానికి రూ.14.60 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 2021లో సంభ వించిన నివార్ తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో ధ్వంసం అయిన పొర్లుకట్టలు, సాగునీటి కాలువల పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలియజేశారు. ఇటీవల సంభవించిన ముంథా తుఫాన్‌కు దెబ్బతిన్న కాలువల మరమ్మతులకు కూడా నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆటోల మయం

● నగరంలో విచ్చల విడిగా పెరిగిన ఆటోలు
● 'స్త్రీశక్తి'తో ఆర్టీసీకి ఆదరణ
● ఫలితంగా పల్లెల నుంచి టౌన్ బాటపట్టిన ఆటోలు
● ఇష్టానుసారంగా స్టాండ్లు
● ఎక్కడపడితే అక్కడ నిలిపేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం
● యువతులు, మహిళలకు వేధింపులు
● నియంత్రణకు చర్యలేవి..?



నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోవాలాలకు అడ్డాగా నెల్లూరు నగరం మారింది. నగరంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడినప్పుడు.. ఏదైనా ఎత్తయిన ప్రాంతం నుంచి చూస్తే కంటికి కనిపించినంత దూరం ఆటోలే దర్శనమిస్తాయి. నగరంలో ఆటోల సంఖ్య వేలల్లో నుంచి లక్షలకు చేరిపోయింది.కొందరు ఆటోడ్రైవర్లు నిత్యం మద్యం సేవించి ఆటో నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇంకొందరు ఆటోడ్రైవర్లు పక్కనే స్నేహితులను కూర్చోపెట్టుకొని, యువతులు, మహిళలు ఆటోలు ఎక్కిన సమయంలో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు.

● పెరిగిన ఆటోలు

ప్రభుత్వం గత ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించింది. స్త్రీ శక్తి పథకానికి జిల్లాలో ఆదరణ బాగా లభించడంతో పల్లె ప్రాంతాలకు ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఆటోడ్రైవర్లు పల్లెలను విడిచి పెట్టి నెల్లూరు నగరంలోనే తిప్పుకుంటున్నారు. దీంతో నగరంలో ఆటోలు బాగా పెరిగాయి.

● మర్యాద మరిచి..

ఆటో ప్రయాణం ప్రస్తుతం నగరవాసులకు తప్పనిసరి అయింది. ఈ క్రమంలో ఎంతోమందికి ఆటోలు జీవనోపాధిగా మారాయి. అయితే కొందరు మాత్రం మద్యం సేవించ కుండా ఆటో నడపడం లేదు. ఆటోలో ఎక్కిన వారితో బేరాలు ఆడే క్రమంలో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. వారు అడిగినంత డబ్బులు ఇవ్వక పోయినా, ఆటో ఎక్కక పోయినా అసభ్యంగా దూషిస్తున్నారు. ఇక పల్లెప్రాంతాల ప్రజలతో అయితే మర్యాద లేకుండా మాట్లాడుతున్నారు. నగరంలో ఏ వాహనం వెనుక అయినా వెళ్లొచ్చుకానీ, ఆటోల వెనుక మాత్రం వెళ్లకూడదనే నానుడి ఉంది. నగరంలో రోడ్డుకు కుడివైపున వేగంగా ప్రయాణిస్తున్న ఆటో ఎవరైనా రోడ్డు మధ్యలో చేయిఎత్తితే ముందు వెనుక చూసుకోకుండా, సిగ్నల్ లైటు కూడా వేయకుండా ఎడమ వైపునకు తిప్పేస్తున్నారు. దీంతో వెనుక వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

● ఇష్టారీతిన స్టాండ్లు

నగరంలోని వారధి సెంటర్ నుంచి మినీబైపాస్ మీదుగా అయ్యప్ప గుడి వరకు, మైపాడు గేటు నుంచి మూలాపేటగేట్ సెంటర్ వరకు, నవాబుపేట నుంచి కొత్తూరు వరకు, ఆత్మకూరు బస్టాండు నుంచి వేదాయపాలెం వరకు, ఆర్టీసీ బస్టాండు నుంచి కోవూరు, నారాయణరెడ్డిపేట, ఎన్టీఆర్‌నగర్, నరుకూరు, వెంకటేశ్వరపురం కాలనీ, గొలగమూడి, కొత్తూరు అంబాపురం వరకు ఇలా నగర పరిసరాల్లోని 25 కిలోమీటర్ల వరకు ఉన్న అనేక గ్రామాలకు ఆటోలు వెళుతున్నాయి. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లతోపాటు పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా రోడ్డను ఆక్రమించి, ఆటోస్టాండ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లే మార్గంలో పాత వంతెనను పూర్తిగా ఆటోస్టాండ్‌గా మార్చేశారు. ఆ పక్కనే మరోస్టాండు, ఇక బస్టాండుకు పక్కనే కోవూరు, బుచ్చి ప్రాంతాలకు వెళ్లే స్టాండు ఏర్పాటు చేశారు. ఇక గాంధీబొమ్మ కూడలిలో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

● ముందు కూర్చుని వేధింపులు

గతంలో ఆటోలో ముందు సీట్లో ప్రజలను కూర్చో పెట్టుకోవాలంటేనే ఎక్కడ కేసులు రాస్తారోనని భయపడే పరిస్థితులు ఉండేవి. అయితే ప్రస్తుతం ఆటో ముందు సీట్లో ముగ్గురు, నలుగురు కూడా కూర్చుంటున్నారు.బాగా గమనిస్తే ఆటోడ్రైవర్‌తో పాటు డ్రైవర్ పక్కనే మరో వ్యక్తి కూర్చోని సెంటర్ పేర్లు చెబుతూ అరుస్తుంటాడు. ఈ క్రమంలో ఒంటరిగా మహిళలు ఎక్కితే వారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఈ విషయాలను కుటుంబ సభ్యులకు చెబితే ఉద్యోగాలు మాన్పించేస్తారనో, అనవసరంగా గొడవలు జరుగుతాయనే భయంతో మహిళలు నోరుమెదపడం లేదు.

● నియంత్రించే వారేరీ..?

గతంలో జిల్లాలో పనిచేసిన ఓ ఎస్పీ నగరంలోకి ఇతర ప్రాంతాల ఆటోలు బార్డర్ వరకే రావాలని, నగరానికి చెందిన ఆటోలు మాత్రమే నగరంలో తిరగాలని నిబంధన విధించారు.ఈ నిబంధనలో భాగంగా ఆటోలకు నెంబర్లు కేటాయించారు. అక్రమ ఆటోస్టాండ్ల నియంత్రణకు గట్టి చర్యలు చేపట్టారు. అయితే ఇప్పుడు ఆటోల నియంత్రణకు ఎలాంటి చర్యలు లేవు. అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. ఎంతోమంది పద్ధతిగా ఆటోలు నడుపుతూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కొంతమంది ప్రవర్తనతోనే సమస్య తలెత్తుతున్నది.

రామాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఆలయంలో విగ్రహాలు, ధ్వజ ప్రతిష్ఠ



నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జ్యోతినగర్‌లో నిర్మించిన సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి దేవస్థానంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. ఆలయ చైర్మన్ ఎల్‌పీ కృష్ణారెడ్డి, కార్యదర్శి శివరాం మాట్లాడుతూ గతంలో ఉన్న ఆలయాన్ని పునర్నిర్మించామని చెప్పారు. ఈ సందర్భంగా అన్న సంతర్పణ చేశారు. కార్పొరేటర్ బూడిద పురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బరాయుడు, రఘురామయ్య, హరిప్రసాద్, మురళి, సురేష్, రమేష్, పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారుడికి నివాళి

నెల్లూరు(విద్య), నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : సీనియర్ హాకీ క్రీడాకారుడు లాబాన్ దేవప్రసాద్ శుక్రవారం రాత్రి మృతి చెందారు. శనివారం ఫత్తేఖాన్‌పేటలోని ఆయన నివాసంలో పార్థివ దేహానికి సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి ఉమాశంకర్, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు థామస్‌పీటర్, హాకీ క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి సంతాపాన్ని తెలియచేశారు. అనంతరం బాప్టిస్టు చర్చి డౌనీ హాలు నుంచి అంతిమయాత్ర నిర్వహించి సుబేదారుపేటలోని క్రైస్తవ సమాధితోటలో అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు పరమేశ్వరుడికి భస్మాభిషేకం, జ్వాలాతోరణం!

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో వెలసిన శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి కార్తీకమాస మూడవ సోమవారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, మహా శివలింగానికి 21 కేజీల భస్మంతో అభిషేకం, హారతి, తీర్థ ప్రసాద వినియోగం, సాయంత్రం 1,116 జ్యోతులతో సహస్ర లింగార్చన, రాత్రి జ్వాలాతోరణం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు.

న్యూ హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న మాజీ మేయర్ భానుశ్రీ

నెల్లూరు(సిటీ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఇతర రాష్ట్రాల్లో తయారైన అనేక వస్తు, సామగ్రి నెల్లూరు ప్రజలకు న్యూ హ్యాండ్లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ద్వారా అందుబాటులోకి వచ్చాయని మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీ అన్నారు. నగరంలోని కేవీఆర్ పెట్రోలు బంకు కూడలి లో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌ను ఆమె శనివారం ప్రారంభించారు. అమ్మకపు ప్రదర్శనశాల నిర్వాహకులు అషు శర్మ, అమిత్‌సింగ్, జునేద్, అస్లాం మాట్లాడుతూ మీరట్ ఖాదీషర్ట్స్, లక్నో చికెన్‌వర్కు శారీస్, డ్రెస్ మెటీరియల్, టాప్‌లు, బనారస్ శారీస్, ముంబై ఫ్యాన్సీ జ్యూయలరీ, కాటన్ టాప్స్, సారంగపూర్ ఫర్నిచర్, కేరళ హల్వా... వంటివి ఇక్కడ ప్రత్యేకమన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జి దాట్ల చక్రవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉచ్చి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నెల్లూరుకు చెందిన ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ శనివారం విజయవాడలోని బ్రాహ్మణ సంక్షేమ సంస్థ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. సంస్థ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ నుంచి నియామక పత్రా న్నందుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ల బోర్డు సమావేశం జరిగింది. భువనేశ్వరీ ప్రసాద్ మాట్లాడుతూ బ్రాహ్మణుల సంక్షేమం కోసం పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



భువనేశ్వరీప్రసాద్‌ను అభినందిస్తున్న రాంప్రసాద్ తదితరులు

స.హ చట్టం నోటీస్ బోర్డులో వివరాలు ఏవీ?



సంగం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం నోటీస్ బోర్డు అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిదర్శనం. ప్రతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం నోటీస్ బోర్డులో పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు విధిగా నోటీస్ బోర్డులో నమోదు చేయాలి. కానీ స్థానిక పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారుల పేర్లుగానీ, ఫోన్ నెంబర్లు రాయలేదు. గతంలో ఉన్న పాత నెంబర్లు, పేర్లను కొట్టివేశారు. అదేవిధంగా అప్పీల్ స్వీకరించు అధికారి పేరు కూడా తప్పే. ఎప్పుడో ఏడెనిమిదేళ్ల కిందట పనిచేసిన అధికారి పేరు, ఫోన్ నెంబరు మాత్రమే దర్శనమిస్తోంది. దీన్ని చూసిన ఫిర్యాదుదారులు విస్తుపోతున్నారు.

అనధికారికంగా చేపలు పడితే చర్యలు

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం, పైతట్టు ప్రాంతాల్లో ఎవరైనా అనధికారికంగా చేపలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలాశయ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బచ్చల చెన్నరాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. తాము ప్రభుత్వం నుంచి అనుమతి పొంది జలాశయంలో చేప పిల్లలను వదిలామన్నారు. కొందరు గాలాలు వేసి మత్స్యసంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు.

ఆక్రమణల చెరలో తిరుమనతిప్ప

● యథేచ్ఛగా యంత్రాలతో చదును ● పట్టించుకోని పాలకులు, అధికారులు ● వర్షాలు పడితే ప్రమాదమని ప్రజల ఆందోళన



తిప్పను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

సంగం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగం తిరుమనతిప్ప ఆక్రమణలకు గురవుతోంది. కొందరు ఇష్టారాజ్యంగా ఆక్రమించి చదును చేస్తున్నారు. రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ తిప్పలో చదునుగా ఉన్న ప్రాంతంలో గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో బీసీ, ఎస్టీ కాలనీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. అంకణం రూ.50 వేలు పలుకుతోంది. దీంతో కొందరు ఇళ్లకు పైభాగంలో తిప్పను చదును చేసి ఇళ్ల స్థలాలుగా మార్చేతున్నారు. అడిగేవారు లేకపోవడంతో గత కొంత కాలం నుంచి ఎస్టీ కాలనీలో ప్రతి వీధి చివరన ఎక్స్‌కవేటర్లతో తిప్పను చదును చేస్తున్నారు. దీనివల్ల వర్షాకాలంలో తిప్ప ఎగువ ప్రాంతం నీటికి కరిగి బండరాళ్లు, మట్టి పెళ్లలు దొర్లిపడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అరికట్టాలని స్థానిక కాలనీ ప్రజలు కోరుతున్నారు.

యమపాశాలు.. ఈ విద్యుత్ స్తంభాలు..!

● దశాబ్దాలుగా మార్చని వైనం
● ఆందోళనలో ప్రజానీకం



యూనియన్‌రోడ్డులో స్తంభానికి ఉన్న కనెక్షన్లు



నాగులబావివీధిలో వంకరపోయిన స్తంభం

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రజలను వణికిస్తున్నాయి. వానకు తడిసినప్పుడు విద్యుత్ సరఫరా అవుతుండడంతో వాటి సమీపానికి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. చాలా స్తంభాలు రహదారుల పక్కనే ఉన్నాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసినవి కావడంతో కొన్ని తుప్పు పట్టి కూలిపోయే దుస్థితికి చేరుకున్నాయి. ఒక్కో స్తంభానికి వందలాది కనెక్షన్లు ఇవ్వడంతో తీగలు చుట్టూ పేరుకుపోయి స్తంభాలకు విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు కరెంటుకు బలి కాకముందే అధికారులు స్పందించి ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చాలని ప్రజలు కోరు తున్నారు.

ఇరుకు వీధుల్లో తీవ్ర ఇబ్బందులు : పట్టణంలో యూనియన్ రోడ్డు, నాగులబావి వీధి, కోళ్లవీధి, సుద్దబావివీధి, షామీర్సా వీధులు ఇరుకుగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో దశా బ్దాల కిందట ఏర్పాటు చేసిన స్తంభాలే నేటికీ ఉన్నాయి. వీధులు ఇరుకుగా ఉండటం, ఇనుప స్తంభాలు రహదారుల పక్కనే ఏర్పాటు చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన సందర్భాల్లో వీటికి విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. పిల్లలు పొరపాటున స్తంభాలను ముట్టుకున్నా, మూగజీవాలు తగిలినా ప్రాణాలకే ప్రమాదమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టడంతో కొన్ని ఎత్తు తగ్గగా, మరికొన్ని స్తంభాలు వాహనాలు ఢీకొనడంతో దెబ్బ తిని ప్రమాదకరంగా మారాయి. ఇనుప విద్యుత్ స్తంభాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అలాగే యాదవపాళెం, మెయిన్ బజార్, స్టేట్‌పేట ప్రాంతాల్లో సిమెంట్ విద్యుత్ స్తంభా లు పక్కకు ఒరిగి కూలిపోయే దశలో ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ఇనుప విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు సచివాలయ కార్యదర్శుల సస్పెన్షన్

నెల్లూరు(సిటీ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా జారీ చేసిన షోకాజు నోటీసుకు సంతృప్తికరమైన వివరణ ఇవ్వనందున ఇద్దరు సచివాలయ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ నెల్లూరు నగర కమిషనర్ నందన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 45వ డివిజన్ రామ్మూర్తినగర్ 2వ సచివాలయంలో శానిటేషన్ కార్యదర్శిగా ఉన్న టీ శోభనను సస్పెండ్ చేసి ఆమె స్థానంలో 1వ సచివాలయం శానిటేషన్ కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించారు. అలాగే 27వ డివిజన్ లక్ష్మీసాయి నగర్ సచివాలయం శానిటేషన్ కార్యదర్శి ఎన్ ధనుంజయ్‌ను సస్పెండ్ చేసి ఆయన స్థానంలో 2వ సచివాలయంలోని శానిటేషన్ కార్యదర్శికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు కమిషనర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఖాదర్‌బాషా ఎంపిక



వింజమూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉదయగిరికి చెందిన ఖాదర్‌బాషా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రతీ ఏటా నవంబరు 11న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను ఈ అవార్డులతో సత్కరిస్తుంది. నవంబరు 11న విజయవాడలో జరిగే అవార్డుల ప్రదానోత్సవ సభలో ఖాదరబాషా ఈ అవార్డును అందుకోనున్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో విజయకుమార్, వెంకటలక్ష్మి, శ్రీదేవి తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ శంకరన్ హాల్లో శనివారం కనదాసు జయంత్యుత్సవాన్ని ఘనంగా జరిగింది. కనకదాస చిత్రపటానికి డీఆర్వో విజయకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కర్నాటకలోని హావేరి జిల్లా బాడ గ్రామంలో జన్మించిన కనకదాస శ్రీకృష్ణుని భక్తుడని, ఆధునిక కవి, తత్వవేత్త, స్వరకర్త అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి పీ వెంకట లక్ష్మమ్మ, సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన యువకుడి మృతి



ప్రసాదు(ఫైల్)

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వేగనియంత్రణ కోసం 167బీ జాతీయ రహదారిపై పలుకూరు వద్ద ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పట్టణంలోని కోవూరు రోడ్డులో నివాసం ఉండే ప్రసాదు(40) ఈనెల 6న మోటారుసైకిల్‌పై సింగరాయకొండ నుంచి కందుకూరుకు వస్తూ పలుకూరు వద్ద డ్రమ్ములను ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యచికిత్స నిమిత్తం ఆయనను గుంటూరు వైద్యశాలకు తరలించగా అక్కడి డాక్టర్లు బ్రతికే అవకాశం లేదని చెప్పటంతో కందుకూరుకు తీసుకుని రాగా శనివారం ఉదయం మృతి చెందాడు. కాగా జాతీయ రహదారిపై వేగనియంత్రణకు ఇనుప బారికేడ్లు లాంటివి ఏర్పాటు చేయాలి తప్ప ఇనుప డ్రమ్ములు పెట్టడం వల్ల అవి దగ్గరకు వచ్చేవరకు కనిపించటం లేదని, దీంతో వాటిని ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు.

రవాణా చార్జీలు ఎప్పుడిస్తారు..?

- విద్యార్థుల ఎదురుచూపులు
- గతంలో విద్యా సంవత్సరం చివర్లో అందజేత
- ఈ ప్రభుత్వంలో 3నెలలకొకసారంటూ హామీ
- ఆరునెలలైనా విడుదలకాని వైనం

సంగం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి దూరప్రాంతాల నుంచి వచ్చేందుకు ఇచ్చే రవాణా చార్జీల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో పాఠశాలలు దూరం ఉన్నాయి. అలాంటి చోట్ల విద్యార్థులు అందుబాటులో ఉంటే బస్సులు.. లేకపోతే ఆటోలు, ఇతర వాహనాల్లో పాఠశాలలకు వెళ్తున్నారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారింది. ఈక్రమంలో ఈ ఏడాది నుంచి మూడు నెలలకొకసారి విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

● రవాణా చార్జీలు తప్పనిసరి

జిల్లా వ్యాప్తంగా 2,571 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు సుమారు 56 వేలమంది వరకు చదువుకుంటున్నారు. సాధారణంగా విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు పాఠశాలలు నిర్ణీత దూరంలో లేని పక్షంలో వారికి తప్పనసరిగా రవాణా చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలి. ఈ చార్జీలను కేంద్ర ప్రభుత్వం 60శాతం భరిస్తే, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండే ప్రాథమిక పాఠశాల ఇంటి నుంచి కిలోమీటరు కంటే ఎక్కువ దూ రంలో ఉన్నా.. ఆరు నుంచి ఎనమిదో తరగతుల పాఠశాలల విద్యార్థుల ఇళ్ల నుంచి మూడు కిలోమీటర్ల దూరం కంటే ఎక్కువ ఉన్నా.... ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 600 వంతున చెల్లించాలి. గతంలో విద్యార్థులకు ఈ రవాణా చార్జీలను విద్యా సంవత్సరం చి వరిలో చెల్లించేవారు. ఈ ఏడాది నుంచి మూడు నెలలకొకసారి చెల్లిస్తే తల్లిదండ్రు ల కు వెసులుబాటు కలుగుతుందని ప్రభుత్వం భావించి, ఆ మేరకు హామీ ఇచ్చింది.

● 12,951 మంది విద్యార్థులకు లబ్ధి

విద్యాశాఖ లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 12,951 మంది విద్యార్థులు ఉన్నారు. రవాణా చార్జీల కింద వీరందరికి లబ్ధి చేకూరనుంది. ఈ మేరకు వీరి రవాణా చార్జీలను విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేలా ప్రభుత్వం ప్రకటించింది.

● ఎదురుచూపులు

రవాణా చార్జీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు. పాఠశాలలు తెరిచి ఇప్పటికే ఆరో నెల గడుస్తుంది. మూడునెలలకొకసారి లెక్కన ఆగస్టులో మొదటి విడత చార్జీలు జమ చేయాలి. ఇంకా జమ కాలేదు. ఈ నెలలో రెండో విడత వేయాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల రవాణా చార్జీలను విడుదల చేయాలి.



పెరమన గ్రామం నుంచి సంగం హైస్కూలుకు ఆటోలో వస్తున్న విద్యార్థులు

శబరిగిరి యాత్రకు మరో 18 రైళ్లు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), (ఆంధ్రజ్యోతి): శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే మరో 18 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఇప్పటికే జిల్లా మీదుగా దాదాపు 50 ప్రత్యేక రైళ్లను వేసిన విషయం విదితమే. తాజాగా మరో 18 వేస్తున్నట్లు తెలిపింది.

ఇద్దరు దొంగల అరెస్టు : 80 గ్రాముల బంగారం రికవరీ

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఉలవపాడు వడ్డెపాలెంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన చోరీ కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం వెల్లడించారు. శనివారం కందుకూరు సీఐ అన్వర్‌బాషా, ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ దొంగతనం, రికవరీ వివరాలను తెలిపారు. జిల్లాలోని విడవలూరు మండలం వావిళ్ల గ్రామానికి చెందిన మడపర్తి సతీష్, మోర్ల శివప్రసాద్, బొట్టు చంద్రశేఖర్‌లు ఈ దొంగతనానికి పాల్పడ్డారని, వారిలో సతీష్‌పై వివిధ పోలీసు స్టేషన్లలో 13 కేసులు ఉన్నాయని తెలిపారు. ఉలవపాడు వడ్డెపాలెంలో నివసిస్తున్న పాకల అరుణ ఇంట్లో జరిగిన దొంగతనంలో 90 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు అప్పట్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందని, ఈకేసులో నేరస్థులుగా గుర్తించిన సతీష్, శివప్రసాద్‌లను ప్రస్తుతం అరెస్టు చేసి వారి నుంచి 80 గ్రాములు రికవరీ చేశామని తెలిపారు. చంద్రశేఖర్‌ను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ కేసులో సీఐ అన్వర్‌బాషా, ఎస్‌ఐ అంకమ్మ, ఉలవపాడు పోలీసు స్టేషన్ సిబ్బందితో పాటు సీసీఎస్ సీఐ బీ.అశోక్‌కుమార్, సీసీఎస్ స్టేషన్ సిబ్బంది చాకచక్యంగా దర్యాప్తు చేసి దొంగలను రాజుపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం అరెస్టు చేశారని వివరించారు. దొంగతనం కేసు దర్యాప్తులో మంచి పురోగతి సాధించటంలో క్రియాశీలంగా పనిచేసిన ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మ, స్టేషన్ సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారని డీఎస్పీ తెలిపారు. రికవరీ సొత్తును, దొంగలను కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, పక్కన సీఐ అన్వర్‌బాషా

మరో తిరుమలగా బిలకూట క్షేత్రం : మంత్రి ఆనం

బిట్రగుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం ప్రసన్న వేంకటేశ్వరస్వామి వెలసిన బిలకూట క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బోగోలు మండలం కొండబిట్రగుంట వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పలు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారికి సేవలు చేసుకునే భాగ్యం తనకు దొరికిందన్నారు. ఆలయానికి మహాప్రాకారం, రథశాల, వేదపాఠశాల, తూర్పు వైపున గాలిగోపురం పనులు పూర్తి చేసుకుంటే శోభాయమానంగా ఉంటుందని చెప్పారు. బిలకూట క్షేత్రం తిరుమల అంతటి పుణ్యక్షేత్రం కావాలని, ఇందుకు అందరి సహకారం అవసరమన్నారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ దిగువ ప్రాంతంలో రూ. 2కోట్లతో ధ్యాన మందిరం, రూ.23 లక్షలతో రథశాల, రూ.2 కోట్లతో కల్యాణ మండపం, రూ. 35 లక్షలతో కల్యాణకట్ట, రూ. 2లక్షలతో గరుత్మంతుడి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు ఆనం వివరించారు. అలాగే తూర్పు గాలిగోపురం, రాతి మెట్లు, గోశాల నిర్మాణాలు జరుగుతాయని వివరించారు. దాతలంతా సహకరిస్తే పనులు త్వరగా పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, జనసేన నేత అలహరి సుధాకర్, కావలి డీఎస్పీ శ్రీధర్, కావలి రూరల్ సీఐ పాపారావు, బీజేపీ నేత కే.బ్రహ్మానందం, టీడీపీ నేత ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, తదితరులు

ముగిసిన వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు

● వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ ఛాంపియన్లుగా కావలి జేబీ



వాలీబాల్ ఫైనల్స్‌లో పోటీపడుతున్న జేబీ, అలెక్సా కళాశాలల జట్లు

కావలి(టౌన్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వీఎస్‌యు పీజీ కళాశాలలో జరుగుతున్న విక్రమ సింహపురి యూనివర్శిటీ మహిళల అంతర్ కళాశాలల క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో వాలీబాల్, హ్యాండ్ బాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ ఫైనల్ పోటీలను జేబీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి ప్రారంభించారు. వాలీబాల్ విన్నర్‌గా కావలి జేబీ, రన్నర్‌గా నెల్లూరు అలెక్సా, బాల్ బ్యాడ్మింటన్ విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా అలెక్సా, హ్యాండ్‌బాల్‌లో విన్నర్‌గా జేబీ, రన్నర్‌గా అలెక్సా, ఖోఖో విన్నర్‌గా డీకేడబ్ల్యూ నెల్లూరు, రన్నర్‌గా జేబీ, చెస్ విన్నర్‌గా కావలి శ్రీచైతన్య, రన్నర్‌గా డాక్టర్ ఎస్ ఆర్‌జీ ఆత్మకూరు, టెన్నిస్ సింగిల్స్ విన్నర్‌గా వీఎస్‌యు నెల్లూరు, రన్నర్‌గా జేబీ, డబుల్స్ విన్నర్‌గా కావలి శ్రీసాయి, రన్నర్‌గా జేబీ జట్లు నిలిచాయి. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల పీడీ మణికంఠ, అమ్మాజీ, జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి, సీనియర్ పీడీలు రవీంద్రబాబు, వెంకటేశ్వర్లు, వీఎస్‌యూ పీడీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గుమ్మళ్ళదిబ్బ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోవూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పాఠశాలల ఆటల పోటీలకు గుమ్మళ్ళదిబ్బ ఉన్నత పాఠశాల విద్యార్థులు 23 మంది ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు ఇందిరా దేవి తెలిపారు. ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఖోఖో పోటీల్లో జిల్లా తరఫున తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులతోపాటు, వీరికి క్రీడల్లో ఉత్తమ శిక్షణ ఇస్తున్న పీడీ మధుసూదనరావు, పీఈటీ అజయ్‌లను ఆమె అభినందించారు.

పీఆర్ ఇంజనీర్ల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నెల్లూరులోని పీఆర్ఎస్ఈ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎం బాబురావు, ఉపాధ్యక్షుడిగా ఓ రమేష్, ప్రధాన కార్యదర్శిగా కే సుధాకర్‌రావు, కోశాధికారిగా వై వాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏకేవీ ప్రసాద్ ఎన్నికయ్యారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

ఉలవపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపట్టపుపాలెంకు చెందిన యువకుడు రాజు సముద్రంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన రాయల్ చంద్రయ్య, రాజులు తమ సొంత ఫైబర్ బోటులో చేపల వేటకు వెళ్లారు. తిరిగి ఉదయం ఒడ్డుకు చేరే క్రమంలో అలల ఉధృతికి ఫైబర్ బోటు తిరగబడింది. ఈ ఘటనలో నీటిలో మునిగిన రాజు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి మత్స్యకారులు సంఘటన స్థలానికి చేరుకొని చంద్రయ్యను రాజును బయటకు తీసుకొని వచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న రాజుని ఉలవపాడు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతుడు రాజు బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్బన్ కాంక్లేవ్ సదస్సుకు నెల్లూరు కమిషనర్

నెల్లూరు(సిటీ), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో శనివారం నిర్వహించిన అర్బన్ కాంక్లేవ్ - 2025 సదస్సుకు నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ హాజరయ్యారు. పట్టణ, నగర ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు అందించాల్సిన సేవలు, తీసుకోవాల్సిన చర్యలపై ఇందులో చర్చించారు. పురపాలక శాఖకు చెందిన రాష్ట్ర ఉన్నతాధికారులు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు.

ఎక్కాలంటే ఎత్తు.. దిగాలంటే దిగులు !

● 'పల్లె వెలుగు' బస్సు మెట్లతో ఇక్కట్లు

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆర్టీసీ డిపోకు చెందిన ఓ పల్లె వెలుగు బస్సు ప్రయాణికులకు భారంగా మారింది. ఈ బస్సు ఎక్కాలన్నా.. దిగాలన్నా ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఎందుకో తెలుసా? ఉదయగిరి-సీతారామపురం మార్గంలో తిరిగే ఈ బస్సు ద్వారం వద్ద మెట్లు చాలా ఎత్తులో ఉన్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు ఎక్కాలన్నా.. దిగాలన్నా నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు తలుపు కూడా లేకపోవడంతో చలి గాలికి ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా డిపో అధికారులు స్పందించి బస్సు ద్వారం వద్ద మెట్ల ఎత్తు తగ్గించడంతోపాటు తలుపు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మెట్లు ఎత్తుగా.. డోరు ఖాళీగా ఉన్న ఆర్టీసీ బస్సు

దీపం పరంజ్యోతి స్వరూపం

- సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతి
- ముగిసిన కార్తీక మాస లక్ష దీపోత్సవం
- పాల్గొన్న మున్సిపల్ మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు



పండరి నాథుడి సన్నిధిలో రామానంద భారతి స్వామి, మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి దంపతులు, ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దీపం పరంజ్యోతి స్వరూపమని విశాఖ సౌభాగ్య భువనేశ్వరీ పీఠాధిపతి రామానంద భారతీ స్వామి తెలిపారు. కార్తీక మాసంలో భక్తిశ్రద్ధలతో దీపారాధన చేసి, శివకేశవులను పూజిస్తే వారి అనుగ్రహం తప్పక లభిస్తుందని వివరించారు. ఒక్క కార్తీక మాసంలోనే కాకుండా ప్రతీ రోజూ సంధ్య వేళ మహిళలు దీపారాధన అలవాటు చేసుకోవాలని సూచించారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా వైభవంగా జరుగుతున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం శనివారంతో ముగిసింది. చివరి రోజు రాత్రి రామానంద భారతీ స్వామి ఆకాశ దీపాన్ని వెలిగించి భక్తులకు అభిభాషణ చేశారు. అగ్ని స్వరూపుడైన అరుణాచలేశ్వరుడి ఆరాధనే లక్ష దీపోత్సవ లక్ష్యమని తెలిపారు. మంచి సంకల్పంతో ప్రారంభించిన లక్ష దీపోత్సవానికి ప్రకృతి సహకరించిందని, ఈ కార్యక్రమంతో జిల్లా ప్రజలందరికీ మంచి జరుగుతుందంటూ ఆశీస్సులు అందజేశారు. పదేళ్లుగా కార్తీక దీపోత్సవం నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులకు శివకేశవుల అనుగ్రహం లభిస్తుందని మంగళా శాసనాలు చేశారు. కాగా, చివరి రోజు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కందుకూరు, ఉదయగిరి ఎమ్మెల్యేలు ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్ హాజరయ్యారు. వీరు నాగేశ్వరస్వామి జ్యోతిర్లింగం, పండరీనాథ్ పాండురంగస్వామికి పూజలు చేశారు. ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగింది. 501 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే చండీ హోమం కూడా జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం విశేష పూజలు స్పటిక లింగానికి రుద్రాభిషేకాలు జరిగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

● మనోహరంగా మల్లన్న కల్యాణం

శ్రీశైలం నుంచి వచ్చిన మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కల్యాణ మహోత్సవం గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ బృందం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఏర్పాట్లను దీపోత్సవ కమిటీ సభ్యులు కంజర్ల భాస్కర్‌శర్మ, ఆమంచర్ల వెంకటప్రభాకర్‌రావు, గంధం సునీల్‌కుమార్, ఆశం విజయసారధి పర్యవేక్షించారు.



లక్ష దీపోత్సవంలో భాగంగా దీపాలు వెలిగిస్తున్న మహిళలు



లక్ష దీపోత్సవంలో నిర్వహించిన ఛండీహోమం

రేపు పరమేశ్వరుడికి భస్మాభిషేకం, జ్వాలాతోరణం!

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో వెలసిన శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి కార్తీకమాస మూడవ సోమవారం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, మహా శివలింగానికి 21 కేజీల భస్మంతో అభిషేకం, హారతి, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం 1,116 జ్యోతులతో సహస్ర జ్యోతిర్లింగార్చన, రాత్రి జ్వాలాతోరణం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11,520
వెండి కిలో ధర	రూ. 1,51,600
వెండి ఒక గ్రాము	రూ. 157.60

సాగరం చెరువు అలుగు గోడ ధ్వంసం

● గండి కొట్టడంతో వృథాగా పోతున్న నీరు



అలుగు కాంక్రీట్ గోడను ధ్వంసం చేయడంతో వృథాగా పోతున్న నీరు

అనంతసాగరం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతసాగరం చెరువు అలుగుకు నిర్మించిన కాంక్రీట్ గోడను ధ్వంసం చేసి మూడు చోట్ల గండి కొట్టడడంతో జలాలు వృథాగా పోతున్న విషయం ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. అయితే గండ్లు ఎవరూ కొట్టారు అనే విషయంపై సందిగ్ధం నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు సాగరం చెరువుకు నీరు చేరింది. చెరువు నిండితే అలుగు నుంచి అదనపు నీరు పారేలా గతంలో పనులు చేశారు. అయితే అలుగు గోడకు మూడు చోట్ల గండ్లు కొట్టడంతో చెరువుకు చేరిన నీరు వృథాగాపోతోంది. వాస్తవానికి అలుగు ప్రాంతం వైపు జన సంచారం ఉండదు. దీంతో దానిని ఎప్పుడు ధ్వంసం చేశారో తెలియదు. కానీ చెరువు నిండితే లోతట్టున ఉన్న పాతాళపల్లి, గోవిందమ్మపల్లి, ముస్తాపురం, మంగుపల్లి ప్రాంతాల్లో పొలాలు మునకకు గురువుతుంటాయని, దీంతో గుర్తుతెలియని రైతులు ఈ గండ్లు కొట్టివుంటారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆత్మకూరు అభివృద్ధి 'ఆనం'తోనే సాధ్యం

● సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చేజర్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడితోనే సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్ తెలిపారు. శనివారం మండలంలోని నూతక్కి వారి కండ్రికలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నూతనంగా రూ.3.27 కోట్ల ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు మంజూరైనట్లు తెలిపారు. అందులో నూతక్కి వారి కండ్రికలో 12 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు రాజాల ఆదినారాయణ రెడ్డి, రామానాయుడు, పెంచలరెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీడని ట్రాఫిక్ కష్టాలు..!!

● ఆత్మకూరులో విస్తరణకు నోచని ప్రధాన రహదారి

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): వీడని ట్రాఫిక్ కష్టాలు వీడడం లేదు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి సోమశిల రోడ్డు సెంటర్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్డు విస్తరించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని పాలకులు, అధికారులు చెబుతూనే ఉన్నారు. ఏళ్ల తరబడి విస్తరణ పనులు ఆగిపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. విస్తరణ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రధాన రహదారి పూర్తి స్థాయిలో విస్తరణకు నోచుకోకపోవడంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలు ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు నాలుగురోడ్ల రహదారి పనులు పూర్తయి మధ్యలో సెంట్రల్ లైటింగ్, పూల మొక్కలు పెంచేవిధంగా ఆధునీకరించాలని గత మున్సిపాలిటీ పాలకవర్గం నిర్ణయించింది. అయితే రోడ్డు విస్తరణ పనులు నెల్లూరుపాళెం సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు పూర్తయ్యాయి. అక్కడి నుంచి సోమశిల రోడ్డుసెంటర్ వరకు రోడ్డు విస్తరణకు అడ్డంకులు ఏర్పడ్డాయి. రోడ్డుకు ఇరువైపులా విస్తరణకు సంబంధిత భవనాల యజమానులు అంగీకరించకపోవడంతో పదేళ్లకు పైబడి రోడ్డు పనులు నిలిచిపోయాయి. దాంతో రోడ్డు అధ్వానంగా తయారైంది. దానికితోడు ట్రాఫిక్ సమస్య తీవ్రతరవుతోంది. ఆ రహదారిపై



ఆత్మకూరులోని ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ప్రతి రోజు ట్రాఫిక్ నిలిచిపోతోంది. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యంగా ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాల నిలిపివేతను అరికట్టగలగడంతో పాటు రోడ్డు విస్తరణను పూర్తిచేయాల్సి ఉంది. అధికారులు, పాలకులు స్పందించి రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

స.హ చట్టం నోటీస్ బోర్డులో వివరాలు ఏవీ?



వివరాలు లేని స.హ చట్టం బోర్డు

సంగం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం నోటీస్ బోర్డు అధికారుల నిర్లక్ష్యానికి ఒక నిదర్శనం. ప్రతీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం నోటీస్ బోర్డులో పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు విధిగా నోటీస్ బోర్డులో నమోదు చేయాలి. కానీ స్థానిక పౌరసమాచార అధికారి, సహాయ పౌరసమాచార అధికారుల పేర్లుగానీ, ఫోన్ నెంబర్లు రాయలేదు. గతంలో ఉన్న పాత నెంబర్లు, పేర్లను కొట్టివేశారు. అదేవిధంగా అపీల్ స్వీకరించు అధికారి పేరు కూడా తప్పే. ఎప్పుడో ఏడెనిమిదేళ్ల కిందట పనిచేసిన అధికారి పేరు, ఫోన్ నెంబరు మాత్రమే దర్శనమిస్తోంది. దీన్ని చూసిన సమాచార హక్కు చట్టం ఫిర్యాదుదారులు విస్తుపోతున్నారు.

విద్యార్థులకు అభినందన



అవార్డులు అందుకుంటున్న విద్యార్థినులు

ఆత్మకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన స్కిల్ కాంపిటేషన్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటేషన్‌కు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి పొందిన కే.అక్షిత, సీహెచ్ వెన్నెల, డీ.అభినయ, ఎస్ గాయత్రి, రిటైల్ ట్రేడ్ పోటీల్లో తృతీయ స్థానం సాధించిన షేక్ మహ్మద్‌షరీఫ్, చైతు, ప్రవీణ్‌కుమార్‌లను ఆత్మకూరు ఎంఈవో సీహెచ్ అనంతలక్ష్మీ, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

ఆక్రమణల చెరలో తిరుమనతిప్ప

● యథేచ్ఛగా యంత్రాలతో చదును ● పట్టించుకోని పాలకులు, అధికారులు ● వర్షాలు పడితే ప్రమాదమని ప్రజల ఆందోళన



తిప్పను చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్

సంగం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంగం తిరుమనతిప్ప ఆక్రమణలకు గురవుతోంది. కొందరు ఇష్టారాజ్యంగా ఆక్రమించి చదును చేస్తున్నారు. రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ తిప్పలో చదునుగా ఉన్న ప్రాంతంలో గతంలో ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో బీసీ, ఎస్టీ కాలనీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ ఇళ్ల స్థలాలకు డిమాండ్ పెరిగింది. అంకణం రూ.50 వేలు పలుకుతోంది. దీంతో కొందరు ఇళ్లకు పైభాగంలో తిప్పను చదును చేసి ఇళ్ల స్థలాలుగా మార్చుతున్నారు. అడిగేవారు లేకపోవడంతో గత కొంత కాలం నుంచి ఎస్టీ కాలనీలో ప్రతి వీధి చివరన ఎక్స్‌కవేటర్లతో తిప్పను చదును చేస్తున్నారు. దీనివల్ల వర్షాకాలంలో తిప్ప ఎగువ ప్రాంతం నీటికి కరిగి బండరాళ్లు, మట్టి పెళ్లలు దొర్లిపడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అయినా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలను అరికట్టాలని స్థానిక కాలనీ ప్రజలు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

తల్లికి తలకొరివి పెట్టిన తనయ



తల్లికి తలకొరివి పెడుతున్న కుమార్తె లలిత

కావలి రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంచం పట్టిన తల్లి దేవబత్తిన భ్రమరాంబ(79) మృతి చెందగా ఆమెకు తన కుమార్తె తలకొరివి పెట్టి దహన సంస్కారాలు చేసిన ఘటన శనివారం కావలి మండలం చౌదరిపాళెంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. చౌదరిపాళెంకు చెందిన దేవబత్తిన పేరయ్య, భ్రమరాంబ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వ్యవసాయ కుటుంబం అయినప్పటికీ కుమారులు లేరన్న బెంగను వదిలి ముగ్గురు కుమార్తెలకు విద్యాబుద్ధులు నేర్పి వివాహాలు చేశారు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఉన్న తల్లి మృతి చెందడంతో కుమార్తెలు పుట్టింటికి చేరారు. ఒంగోలులో ఉంటున్న ఆమె చిన్నకుమార్తె నల్లారి లలిత తల్లికి తలకొరివి పెట్టి దహనసంస్కారాలు చేసి ఆ తల్లికి కుమారుడు లేని లోటును తీర్చి ఆదర్శంగా నిలిచింది.

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

మర్రిపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి వనం చెన్నకృష్ణయ్య(65) ఆత్మహత్య పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కుంటనిళ్లపాడులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కుటుంబంలో ఏర్పడిన వివాదాల నేపథ్యంలో మనస్థాపంతో తన ఇంట్లో ఉన్న పురుగు మందు తాగడంతో గమనించిన కుంటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటీన బద్వేలు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కడపకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు. దీంతో పోలీసు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

కలువాయి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపూరుపల్లి రామాలయం, వెరుబొట్లపల్లి కలకంటమ్మ ఆలయాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. శనివారం ఉదయం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్థుల సమాచారం మేరకు... కనుపూరుపల్లి రామాలయంలో శుక్రవారం రాత్రి తలుపులు పగలగొట్టి గర్భగుడిలో ఉన్న అమ్మవారి తాళిబొట్లు, హుండీ ఎత్తుకెళ్లారు. వెరుబొట్లపల్లి కలకంటమ్మ ఆలయంలో అమ్మవారి కళ్లకు అలంకరించే వెండి వస్తువులతో పాటు హుండీని తీసుకెళ్లారు. సంఘటనా స్థలాలను ఎస్ఐ కోటయ్య పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకారణంగా ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అకారణంగా ఓ వ్యక్తి మీద దాడి చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని సంతపేట గొర్రెలమిట్ట ప్రాంతంలో పెయింటర్ ఎస్‌కే ఖాదర్‌బాషా నివసిస్తున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం. గురువారం రాత్రి ఆయన పరమేశ్వరినగర్ సమీపంలోని మద్యం దుకాణంలో చాంద్‌బాషా, గౌస్‌బాషా అనే వ్యక్తులతో మాట్లాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి వారితో ఎందుకు మాట్లాడుతున్నావని ప్రశ్నించాడు. ఏమి లేదని చెప్పడంతో వెళ్లిపోయిన ఆ వ్యక్తి కొద్ది సేపటి తర్వాత మరలా వచ్చి ఖాదర్‌బాషాపై దాడి చేశాడు. అంతటితో ఆగక రాయితో ఖాదర్‌పై దాడి చేశాడు. తలకు గాయమైన ఖాదర్‌బాషా జీజీహెచ్‌లో చేరి శనివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు



బస్సుకున్న అత్యవసర ద్వారాలను పరిశీలిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మినీ బైపాస్ రోడ్డు పక్కన నిలిపి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో శుక్రవారం అర్ధరాత్రి సౌత్‌నార్త్ ట్రాఫిక్ పోలీసులు తనఖీలు చేపట్టారు. ట్రావెల్స్ బస్సులకు పర్మిట్, ఎఫ్‌సీ, ఫైర్, ఎగ్జిట్ డోర్ వద్ద సీట్ల ఏర్పాటు... ఇలా అనేక అంశాలను పరిశీలించారు. ప్రధానంగా డ్రైవర్లు మద్యం సేవించారా అన్నదానిపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకటరెడ్డి మాట్లాడుతూ నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

యమ పాశాలు.. ఈ విద్యుత్ స్తంభాలు..!

● దశాబ్దాలుగా మార్చని వైనం
● ఆందోళనలో ప్రజానీకం



యూనియన్‌రోడ్డులో స్తంభానికి ఉన్న కనెక్షన్లు



నాగులబావివీధిలో వంకర పోయిన స్తంభం

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రజలను వణికిస్తున్నాయి. వానకు తడిసినప్పుడు విద్యుత్ సరఫరా అవుతుండడంతో వాటి సమీపానికి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. చాలా స్తంభాలు రహదారుల పక్కనే ఉన్నాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసినవి కావడంతో కొన్ని తుప్పు పట్టి కూలిపోయే దుస్థితికి చేరుకున్నాయి. ఒక్కో స్తంభానికి వందలాది కనెక్షన్లు ఇవ్వడంతో తీగలు చుట్టూ పేరుకుపోయి స్తంభాలకు విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు కరెంటుకు బలి కాకముందే అధికారులు స్పందించి ఇనుప విద్యుత్ స్తంభాలను మార్చాలని ప్రజలు కోరు తున్నారు.

ఇరుకు వీధుల్లో తీవ్ర ఇబ్బందులు : పట్టణంలో యూనియన్ రోడ్డు, నాగులబావి వీధి, కోళ్లవీధి, సుద్దబావివీధి, షామీర్సా వీధులు ఇరుకుగా ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన స్తంభాలే నేటికీ ఉన్నాయి. వీధులు ఇరుకుగా ఉండటం, ఇనుప స్తంభాలు రహదారుల పక్కనే ఏర్పాటు చేయడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన సందర్భాల్లో వీటికి విద్యుత్ సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. పిల్లలు పొరపాటున స్తంభాలను ముట్టుకున్నా, మూగజీవాలు తగిలినా ప్రాణాలకే ప్రమాదమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టడంతో కొన్ని ఎత్తు తగ్గగా, మరికొన్ని స్తంభాలు వాహనాలు ఢీకొనడంతో దెబ్బ తిని ప్రమాదకరంగా మారాయి. ఇనుప విద్యుత్ స్తంభాల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. అలాగే యాదవపాళెం, మెయిన్ బజార్, స్టేట్‌పేట ప్రాంతాల్లో సిమెంట్ విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగి కూలిపోయే దశలో ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ఇనుప విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



వసతుల వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో 2 శ్రీనివాసులు

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచ్ టూల్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుల పరిశీలనలో 7, 8, 9 అంశాలను కోర్సు డైరెక్టర్ శ్రీనివాసులు, రిసోర్సు పర్సన్ నాయబ్ వివరించారు. ఉపాధ్యాయులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుని విద్యార్థులకు సులభంగా బోధించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నూర్జహాన్, రిసోర్సు పర్సన్లు కరీముల్లాహుస్సేన్, అరాఫత్ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్, బాలుర గురుకుల పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం ఎంఈవో-2 శ్రీనివాసులు పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర, ప్రిన్సిపాల్ గఫూర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కుల పంపిణీ

సీతారామపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కలిగి ఉండి మృతి చెందిన కుటుంబాలకు ప్రమాద బీమా నగదు మంజూరైంది. గంగవరం గ్రామానికి చెందిన మేడి బోయిన చిన్న ఓబయ్య మృతి చెందగా, నామినీగా ఉన్న ఆయన భార్య సుబ్బమ్మకు రూ. 5 లక్షలు, నెమళ్లదిన్నెవాసి రాగి మల్లికార్జున మృతి చెందగా, నామిని బుజ్జమ్మకు రూ.5 లక్షలు ప్రమాద బీమా చెక్కులను మండల కన్వీనర్ చింతల శ్రీనువాసులు ఆదేశాల మేరకు శనివారం మండల టీడీపీ నాయకులు అందజేశారు. బాధిత కుటుంబాలకు టీడీపీ అన్ని వేళలా అండగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు వెంగళశెట్టి వెంకటేశ్వరు, చెన్న కేశవులు, జాషువా, ఇజ్రాయిల్, మండల యూత్ అధ్యక్షుడు వికాష్ బాబు, జనసేనపార్టీ నాయకులు భోగినేని కాశీరత్తయ్య (గాంధీ), సుమన్, రామచంద్ర, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అనధికారికంగా చేపలు పడితే చర్యలు

ఉదయగిరి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం, పైతట్టు ప్రాంతాల్లో ఎవరైనా అనధికారికంగా చేపలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జలాశయ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బచ్చల చెన్నరాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాము ప్రభుత్వం నుంచి అనుమతి పొంది జలాశయంలో చేప పిల్లలను వదిలామన్నారు. జలాశయం వద్ద రేయింబవళ్లు కాపలా ఉన్నా కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పగలు, రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా జలాశయం, ఆ పైతట్టు ప్రాంతాల్లో గాలాలు వేసి మత్స్యసంపదను దోచుకొంటున్నారన్నారన్నారు. అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



కోట వీధిలో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

సీతారామపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోటవీధి, అల్లిక వీధి, మెయిన్ బజార్లలో పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర మాట్లాడుతూ గ్రామంలోని ప్రతీ వీధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కచ్చా డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు.

కొత్తూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఇందుకూరుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఒకేషనల్ కోర్సులకు శుక్రవారం నెల్లూరు సెయింట్ జాన్స్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి వృత్తి విద్యా కోర్సుల నైపుణ్యాల పోటీల్లో మండలంలోని కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ ట్రేడ్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించి, ఈనెల 14న రాష్ట్రస్థాయి లో జరిగే పోటీలకు ఎంపికయ్యారు.

బోరు పని చేయదు.. తాగునీరు రాదు!

ఖాళీ బిందెలతో చౌకిచర్ల గిరిజనుల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

విడవలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోటారు బోర్లు చెడిపోవడంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మండల పరిధిలోని చౌకిచర్ల గ్రామానికి చెందిన గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బంది తమ గోడు పట్టించుకోవటం లేదని శనివారం ఖాళీ బిందెలతో కాలనీలో వారు నిరసన తెలిపారు. కాలనీలో సుమారు 24 కుటుంబాలు ఉన్నాయని, తాగు నీటి కోసం పంచాయతీ మోటారుపైనే ఆధారపడ్డామన్నారు. అయితే నాలుగు రోజులుగా బోర్లు మరమ్మతులకు గురవడం వల్ల తాగునీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా మరమ్మతులు చేస్తామంటూనే కాలం గడుపుతున్నారని ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకుడు సమాధి శ్రీనివాసులు ఇంటిలో తాగునీరు పట్టుకుంటు న్నామని, ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కాలనీలో బోర్లు మరమ్మతులు చేయాలని వారు కోరారు.

వరద బాధితులను ఆదుకుందాం!

కొడవలూరు సీఐ సురేంద్రబాబు



నిత్యావసర సరుకులు అందజేస్తున్న సీఐ, ట్రస్టు నిర్వాహకులు

విడవలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యతతో మొంథా తుపాను బాధి తులకు తమవంతుగా చేయూతనందించాలని కొడవలూరు సీఐ సురేంద్రబాబు పిలుపునిచ్చారు. పార్లపల్లి, బుసగాడిపాళెంలో వరద బాధితులకు గొల్లపల్లి చారిటబుల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో నిత్యావసర సరుకులను శనివారం ఆయన అందజేశారు. తుపాను కారణంగా చాలా మంది నిరుపేదలు సర్వస్వం కోల్పోయారని, అలాంటి నిర్భాగ్యులకు ట్రస్టుద్వారా సాయం చేయడం అభినందనీ యమన్నారు. ఇప్పటివరకు ఈ ట్రస్టు ద్వారా నియోజవర్గంలోని 5 గ్రామాల్లో సుమారు 190 గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకు లను అందజేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మానవతావాదులు తుపాను బాధితులను ఆదుకోవడానికి ముందుకు రావాల న్నారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు జ్యోతి, ఎస్ఐ నరేష్ కుమార్ యాదవ్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఏకూరు సుధీర్‌గౌడ్, నాయకులు పూండ్ల ఏసోబు, కాగుటూరి దేవకుమార్ పాల్గొన్నారు.

కల్యాణం..కమనీయం!

రాపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో దేవేరులతో శ్రీవారి కళ్యాణాన్ని ఆలయ అర్చకులు శనివారం ఘనంగా నిర్వ హించారు. తెల్లవారుజామున శ్రీవారికి అభిషే కాలు నిర్వహించి చందనాలంకార సేవ చేశారు. భక్తులు శ్రీవారి నిజరూపాన్ని దర్శించుకున్నారు. సహస్ర దీపాలంకరణ సేవ, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	126
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	252

కోడిగుడ్ల ధర (100): 600

పాఠశాలకు 20 ఫ్యాన్ల వితరణ



కొండాపురం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు స్పిరిట్ ఆఫ్ కేడీపీ సభ్యులు శనివారం 20 ఫ్యాన్లు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కొందరు స్పిరిట్ ఆఫ్ కేడీపీ గ్రూపుగా ఏర్పడి దాదాపు రూ.45 వేల విలువగల ఫ్యాన్లు సమకూర్చగా సభ్యుడు నర్రా శివన్నారాయణ ప్రధానోపాధ్యాయుడు వీ.రాధాక్రిష్ణకు అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందచేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ లక్షణ వారికి ధన్యవాదాలు తెలిపారు.

దుస్థితిలో టిడ్కో గృహాలు!

- వర్షం వస్తే గృహ సముదాయం చెరువే..
- సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



టిడ్కో సముదాయంలో తోలిన కంపోస్టు మట్టి

కావలి రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడులో గత టీడీపీ ప్రభుత్వంలో పేదల ఆవాసాల కోసం నిర్మించిన టిడ్కో గృహాల సముదాయం సమస్యల వలయంగా మారింది. మొంథా తుపానుకు చెరువును తలపించింది. వర్షపు నీరు టిడ్కో గృహాల సముదాయంలోకి చేరడంతో 5 అడుగుల మేర నిల్వ చేరింది. టిడ్కో సముదాయంలో సుమారు 2,200 గృహాలు ఉన్నప్పటికీ అక్కడ ప్రభుత్వం పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో చాలా ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సుమారు 600 కుటుంబాలు ఈ గృహాల్లో నివసిస్తున్నారు. ప్రహరీ నిర్మాణం చేపట్టలేదు. ఒక వైపు చెరువు.. రెండు వైపులా పొలాలు ఉండటం వల్ల చెట్లలో నుంచి సర్పాలు, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో వీధి లైట్లు పూర్తి స్థాయిలో వెలగకపోవటంతో అపరిచిత వ్యక్తులు, దొంగలు భయంతో బిక్కుబిక్కుమంటూ గడపాల్సివస్తోంది. చెరువుల్లో మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకుంటూ టిడ్కో గృహ సముదాయంలోని ఖాళీ ప్రదేశాలకు ఇటీవల డంపింగ్ యార్డులోని కంపోస్టు మట్టిని తోలారు. దీంతో వర్షాలకు ఐదు అడుగుల మేర వర్షపు నీరు ఇళ్ల మధ్యలో నిల్వ చేరడంతో మడుగును తలపించింది. దీంతో తాము ఇళ్లనుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోయారు. కంపోస్టు మట్టిలో కలిసి వర్షపు నీరు తాగునీటి బావిలోకి చేరటంతో తాగునీరు కలుషితమై వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాలకు తూర్పు వైపు ఆనెమడుగు చెరువు ఉండటంతో లోతట్టున ఉన్న నివాస సముదాయంలోకి వర్షపు నీరు వచ్చేయడంతో జలవలయంగా మారింది.



గృహ సముదాయం చుట్టూ ఉన్న కంపచెట్లు

● పరిశీలన సరే.. పరిష్కారమేదీ..?

భారీ వర్షాలతో ముంపునకు గురైన టిడ్కో గృహాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫరూక్, కావలి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, బీజేపీ, సీపీఎం నేతలు, కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌లు పరిశీలించారు. సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే నేటికీ తమ సమస్యలు పరిష్కరించలేదని స్థానికులు వాపోతున్నారు.

రాత్రయితే దొంగల భయం



వీధి లైట్లు ఒక్కటి కూడా వెలగడం లేదు. దీంతో పాటు దొంగల భయం ఎక్కువైంది. ఇక్కడ వాచ్‌మెన్ కూడా లేడు. బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నాం. మా ఇంట్లో దొంగలు పడి సెల్ ఫోన్, నగదు ఎత్తుకెళ్లారు. వాచ్‌మెన్‌ను నియమించి, రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేయాలి.

\- అన్నం పొట్టెమ్మ

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లతో నీటిని తొలిగింపునకు చర్యలు చేపట్టారు. అయితే అధికారులు, పాలకులు పూర్తిస్థాయిలో స్పందించడం లేదు. వెంటనే ఇక్కడి సమస్యలు పరిష్కరించాలి. భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ఉన్నప్పటికీ మీటర్ల వరకు వర్షపు నీరు చేరింది. దీంతో రెండు రోజులుగా చీకట్లో ఉన్నాం. విద్యుత్ సరఫరా సరిగా లేక ఇబ్బందిపడుతున్నాం.

\- కీలు శ్యామ్

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి



గృహ సముదాయం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టక పోవటంతో పక్కనున్న చెరువులోని నీరు మొత్తం ఇళ్లలోకి చేరుతోంది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి. అందుకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించాలి.

\- చవల రమేష్ చంద్ర

బ్రిడ్జి సెంటర్‌లో నిత్యం స్తంభిస్తున్న ట్రాఫిక్!



బ్రిడ్జి సెంటర్‌లో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సులు, వాహన చోదకులు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రంకురోడ్డులోని ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఉదయగిరి రోడ్డులో వంతెనపైకి రాకపోకలు సాగించే బస్సులు ప్రయాణికులను ఎక్కించుకునేందుకు, దించేందుకు వంతెన దిగువ భాగాన నిలపాల్సి ఉంది. దీంతో ఆ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్‌రోడ్లు ఆక్రమణలకు గురి కావటంతో అక్కడ వాహనాలు స్టాపింగ్‌కు ఇబ్బందికరంగా మారింది. ఆక్రమణలను తొలగించటంలో మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవటంతో అవి పెచ్చుమీరి పోయాయి. అలాగే అక్కడ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నా పోలీసు అధికారులు గాలికొదిలేయటంతో ప్రజలకు సమస్యలు తప్పడం లేదు. కొన్ని సందర్భాలలో వంతెనపై నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఒకేసారి మూడు నాలుగు వచ్చి అక్కడ ఆగుతుండటంతో ఆ సమయంలో ట్రాఫిక్ మరింత ఇబ్బంది కరంగా మారుతోంది. మున్సిపల్ అధికారులు, పోలీస్‌లు స్పందించి అప్రోచ్ రోడ్ల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని, బస్సులు ఆగే చోట ఇతర వాహనాలు పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయకపోవడం అన్యాయం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నేతలు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై చెప్పుతో దాడి చేసిన వారిని ఇప్పటి వరకు అరెస్ట్ చేయకపోవడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. మల్లి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై చెప్పుతో దాడి చేసిన రాకేష్ శర్మను బీజేపీ ప్రభుత్వం కాపాడడం భారత ప్రజలకు అవమానకరమన్నారు. చట్టం తనపని తాను చేసుకుని పోతుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చెపుతూ అరెస్టుకు అడ్డుపడటం చూస్తే దళితులను అవమానించటమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దాడిని ఖండించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా దాడి చేసిన రాకేష్‌శర్మను అరెస్ట్ చేసి న్యాయమూర్తులకు న్యాయం జరుగుతోందని నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నరసింహారావు, జరుగుమల్లి విజయరత్నం, శ్రీను, జెడ్డా వాసు, బాలక్రిష్ణ, రమణయ్య, సతీష్ లు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం



సిద్ధేశ్వరస్వామి

కలిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధనకొండూరు కొండపై వెలసియున్న సిద్ధేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు విశేష పూజా కార్యక్రమాలతోపాటు శివపార్వతుల కల్యాణ వేడుకలు వైభవంగా జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వైభవంగా జరిగే ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు తీర్థప్రసాదాలు, అన్నదానమును స్వీకరించాలని గ్రామపెద్దలు కోరారు.

102వ నేత్రదానం

కందుకూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవూరు గ్రామానికి చెందిన డీ. పాపిరెడ్డి(49) గుండెపోటుతో హఠాన్మరణం చెందగా ఆయన కుటుంబసభ్యులు సేవాభావంతో ముందుకొచ్చి నేత్రాలను దానం చేశారు. సక్షమ్ ప్రతినిధి చెన్నా రామాంజనేయులు సహకారంతో నేత్రదానం చేయాలన్న తమ ఆకాంక్షను వ్యక్తం చేయగా ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాల రీసెర్చ్ సెంటర్ నేత్రసేకరణ నిపుణులు వచ్చి పాపిరెడ్డి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతంలో ఇది 102వ నేత్రదానమని, గ్రామీణ ప్రాంతాలలో కూడా నేత్రదానం పట్ల అవగాహన పెరిగిందనేందుకు పాపిరెడ్డి కుటుంబసభ్యులే నిదర్శనమన్నారు. పాపిరెడ్డి చనిపోయాక కూడా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశాన్ని ఆయన కుటుంబసభ్యులు కల్పించారని అభినందించారు.

రోడ్డుపైకి మురుగు నీరు!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



పెదపవని బస్టాండ్ సెంటర్‌లోని రోడ్డుపై చేరిన మురుగు నీరు

లింగసముద్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదపవని బస్టాండ్ సెంటర్‌లోని రోడ్డుపై కొందరు వ్యక్తులు మురికి నీటిని వదులుతున్నారు. బస్టాండ్ సెంటర్‌లోని మెయిన్ సెంటరు నుంచి మసీదు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొందరు హోటళ్ల నిర్వాహకులు, గృహాలకు చెందిన వారు తమ ఇళ్లు, హోటళ్లలోని వ్యర్థాలను, మురుగు నీటిని ప్రతి రోజూ రాత్రి సమయంలో రోడ్డుపై వదులుతున్నారు. దీంతో గ్రామస్థులు ఈ రోడ్డుపై నడవాలన్నా, వాహనదారులు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక ఈ మురుగు నీరు దోమలకు ఆవాసంగా మారి ప్రజలపై దండయాత్ర చేస్తుండడంతో ఎక్కడ వ్యాధులు సంభవిస్తాయోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి నైపుణ్య పోటీలకు కరేడు విద్యార్థినుల ఎంపిక



జ్ఞాపిక అందుకున్న కరేడు విద్యార్థినులు

ఉలవపాడు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సెయింట్ జాన్ పాఠశాలలో జరిగిన పీఎంశ్రీ స్కూల్స్‌కు సంబంధించి వృత్తి విద్యాకోర్సుల ప్రదర్శనల పోటీల్లో హెల్త్‌కేర్ విభాగంలో కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు నలుగురు మొదటి స్థానం సాధించారు.వీరిలో పాకల వెంకటవరలక్ష్మి, నాదెండ్ల గాయత్రి, మాచవరం జస్మిత, బాపనపల్లి అమూల్యలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ.శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ బాలేశ్వరరావు తెలిపారు. వీరిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది. తల్లిదండ్రులు అభినందించారు.

పశుపోషకులకు అవగాహన ఉండాలి



పశువులకు సూడి పరీక్షలు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు

కావలిరూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులు సూడి పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ వీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని గౌరవరం పశువైద్యశాలలో శనివారం పశువులకు నిర్వహించే సూడి పరీక్షలపై పశు పోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు వ్యాపించే పచ్చిక దొమ్మ వ్యాధి నివారణకు టీకాలు వెయ్యటం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం పశువులకు సూడి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలకొండారెడ్డి, పశుపోషకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కలిగిరి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కావలి-కలిగిరి మార్గంలో పెద్దపాడు వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనోజ్‌కుమార్ కుటుంబ సభ్యులను టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం వెంకట క్రిష్ణారెడ్డి పరామర్శించారు. వారి స్వగ్రామంలో మనోజ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు ఆ కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందచేశారు. మనోజ్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొప్పోలు కొండలరావు, జిర్రా పెద్ద అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న పంచాయతీ కార్యదర్శుల కొరత!

- సేవలందక ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు



వలేటివారిపాలెం గ్రామ సచివాలయం

వలేటివారిపాలెం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. దీంతో ఆయా పంచాయతీల్లో పాలన కుటుంపడుతోంది. ఆ పంచాయతీల్లో సేవలందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలు ఉండగా అయ్యవారిపల్లె, చుండి, బడేవారిపాలెం, శాఖవరం, శామీరపాలెం, కళ్లవళ్ల పోలినేనిపాలెం, నేకునాంపురం గ్రామ పంచాయతీలకు మాత్రమే పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. మిగిలిన 13 గ్రామ పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు లేరు. ఒక్కొక్క పంచాయతీకి ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఉండాల్సి ఉండగా 21 గ్రామ పంచాయతీలకు 8 మంది కార్యదర్శులు మాత్రమే ఉన్నారు. దీంతో ఒక్కో కార్యదర్శి 2, 3 పంచాయతీ బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఒక్కడ ఉన్న పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. వారి స్థానాల్లో నియమితులైన పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరకుండానే అధికారపార్టీ నాయకుల సిఫార్సు మేరకు వాళ్లకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. దీంతో మండలంలో పంచాయతీ కార్యదర్శుల కొరత ఏర్పడింది. గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు లేక పనులు సకాలంలో కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. వివిధ పనులపై సచివాలయాలకు వెళ్లితే పంచాయతీ కార్యదర్శులు లేరని చెప్తుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నామని పలువురు వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శులు నియామకంలో ఉన్నతాధికారులు జాప్యం చేస్తున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శులను నియమించి సకాలంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మిక చట్టాలు ఉల్లంఘించడం సరికాదు

- ఏఐఎఫ్‌బీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ



ఏఐఎఫ్‌బీ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

కావలి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ బ్రిటీష్ ప్రభుత్వంపై పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చేందుకు మంత్రి మండలి తీర్మానం చేయడం దారుణమని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ.సుందరరామరాజు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పార్టీ ఈ నెల 23, 24వ తేదీలలో విశాఖలో నిర్వహించే రాష్ట్ర ప్లీనరీని జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సుందరరామరాజు మాట్లాడుతూ ఏఐఎఫ్‌బీ పార్టీ ప్లీనరీ సమావేశాలు విశాఖ పట్టణంలోని కుర్మనపాలెం ఆవాస్‌ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశాలలో కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు గతంలో ఉన్న 8 గంటల పని విధానాలను 10 గంటలకు పెంచుతూ మంత్రి మండలి తీర్మానం చేయడాన్ని ఆయన తప్పు పట్టారు. కార్మిక చట్టాలను పాలీష్ చేసి వాటికి వ్యతిరేకమైన పద్ధతులు అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా అధికారంలో, ప్రతిపక్షంలో ఉండి కార్మికులపై ఈ విధానాన్ని బలవంతంగా రుద్దుతున్నాయన్నారు. జీఎస్టీ ధరలు పెంచి ఇప్పుడు తగ్గించామని ఉత్సవాలు జరుపుకోవడం సరికాదన్నారు. జిల్లాలో కరేడు భూముల విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆయన తప్పుపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌బీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టీ.రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహారావు, టీయూసీసీ జిల్లా కన్వీనర్ కావలి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా.. గట్టెక్కేనా?

- నిండుకుండల్లా సోమశిల, కండలేరు
- భారీ వర్షాలకు నిండిన చెరువులు
- రబీ సాగుకు రైతుల సమాయత్తం



నిండుకుండలా ఉన్న కండలేరు జలాశయం

పొదలకూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సోమశిల, కండలేరు జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. సాగునీటికి ఢోకా లేకున్నా రైతుల్లో రబీ సాగుపై అనేక సందేహాలున్నాయి. పెట్టుబడులు పెరుగుతున్న నేపథ్యంలో దిగుబడిని పెంపొందించు కునేందుకు నూతన వరి వంగడాల కోసం కసరత్తు చేస్తున్నారు. ఇతర జిల్లాల్లో ఉన్న బంధువుల ద్వారా కూడా సమాచారం సేకరించి విత్తన ఎంపికపై ఆరా తీస్తున్నారు. ఎకరాకు 4 నుంచి 5పుట్ల ధాన్యం దిగుబడి అయితేనే పెట్టుబడులు తిరిగి దక్కించు కోగలమనే భావనలో ఉన్నారు. ఎడగారులో వరిసాగు చేసిన రైతులు ధరల్లేక నష్టపో యారు. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు 2.5 పుట్లు కూడా దిగుబడి కాలేదు. గ్రామాల్లో వరి నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కేఎన్ఎం 1688, ఆర్ఎన్ఆర్ 15048 రకాలను పొదలకూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తు న్నారు. ఈ నేపథ్యంలోనే విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. కేఎన్ఎం 7715 రకాన్ని సేకరించేందుకు మండలంలోని తాటిపర్తి, నల్లపాలెం తదితర పెన్నార్ డెల్టా ప్రాంతాల రైతులు తిగుతున్నారు. అలాగే కేఎన్ఎం 12510 గురించి కూడా సమాచారం సేకరిస్తున్నారు. ఈ రకం విత్తనాలు దిగుబడి అధికంగా ఉంటుందని, అయితే సాధారణ రకం కంటే 20రోజులు ఆలస్యంగా కోతలకు వస్తుం దంటున్నారు. ఎకరానికి 4.5 నుంచి 5 పుట్ల ధాన్యం దిగుబడి అవుతుందనే ప్రచారం ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

● యూరియా కార్డుల పంపిణీ

మండలంలోని 10వేల యూరియా కార్డులను అందజేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. అన్నీ రైతు సేవా కేంద్రాలకు యూరియాను దిగుబడి చేసుకున్నా మని, మొదటి కోటా కింద బస్తాలను అందజేస్తామని అంటున్నారు. అయితే చాలా మంది రైతులు తీరవజాస్తి ఆయకట్టు కింద రబీలో వరిసాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగి యూరియా లభ్యం కాక సమస్యలు ఎదుర్కొనే కంటే సాగు చేయకపోవడమే మేలనే ఆలోచనలో ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో బస్తా యూరియా రూ.400 చెల్లించినా లభ్యం కావడంలేదని వాపోతున్నారు. రబీలో మండలంలో 18 వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



నగదు అందజేస్తున్న బ్రహ్మారెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు

రాపూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి సిద్ధవరం గ్రామ వాస్తవ్యులు ఏటూరి బ్రహ్మారెడ్డి, జయశ్రీరెడ్డి దంపతులు రూ.1 లక్షా 116 విరాళం అందించారు. దాతలకు మూడు ఆలయాలలో ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాటు చేసి శ్రీవార్ల దర్శనం, శేష వస్త్ర, ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఏసీ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

ఆపరేషన్ 'రెడ్ శాండిల్'!



● 'ఎర్ర' స్మగ్లర్లపై మరోసారి ఉక్కుపాదం

ఎర్రచందనం జోలికొస్తే తాట తీస్తామంటూ హెచ్చరికలు.

స్మగ్లర్లకు సహకరించొద్దంటూ స్థానికులకు పిలుపు.

సెంటిమెంట్‌ను గుర్తుచేస్తూ స్మగ్లింగ్ అడ్డుకట్టలో భాగస్వాములు కావాలని శ్రీవారి భక్తులకు వినతి.

ఒక్క చెట్టూ నరక్కుండా చూడాలంటూ యంత్రాంగానికి ఆదేశాలు.

శనివారం నాటి తిరుపతి పర్యటనలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాటల ఉద్దేశంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలన్న ప్రభుత్వ వైఖరిని స్పష్టంచేసింది. ఆపరేషన్ కగార్ తరహాలో త్వరలోనే స్మగ్లర్లపై చర్యలు ఉంటాయనీ ఆయన స్పష్టం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టాస్క్‌ఫోర్సు యూనిఫామ్‌లా.. రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ధరించే యూనిఫామ్‌ను పోలిన ప్యాంటు వేసుకుని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జిల్లా పర్యటనకు వచ్చారు. అది టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అధికారుల్లో ఉత్తేజాన్ని నింపింది.

● డిప్యూటీ సీఎం హెచ్చరికలతో స్పష్టమైన ప్రభుత్వ వైఖరి
● యంత్రాంగంపై పెరిగిన ఒత్తిడి

శేషాచల అడవుల నుంచి అంతర్జాతీయ మార్కెట్ దాకా పాతుకుపోయిన నెట్‌వర్క్‌తో వేల కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్న ఎర్రచందనం స్మగ్లర్లపై రాష్ట్ర ప్రభుత్వం మరోమారు ఉక్కుపాదం మోపే పరిస్థితి కనిపిస్తోంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుపతి నుంచి జారీ చేసిన హెచ్చరికలతో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటన్నది స్పష్టమైపోయింది. ఆయన తిరుపతి పర్యటన, సంబంధిత శాఖతో నిర్వహించిన సమీక్షలతో అధికార యంత్రాంగంపై ఒత్తిడి పెరిగింది. పవన్ ఆహార్యం ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రభుత్వ కఠిన వైఖరిని బలంగా చాటినట్టయింది. దీంతో 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ తరహాలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కఠినంగా అడ్డుకునే ప్రయత్నాలు మళ్లీ మొదలైనట్టుగా భావించాల్సి వస్తోంది. మామండూరు అటవీ ప్రాంతంలో పర్యటించిన అనంతరం తిరుపతి మంగళంలోని ఎర్రచందనం గోదామును తనిఖీ చేశారు. అక్కడి భారీ పరిమాణంలో పోగుపడిన ఎర్రచందనం దుంగలను చూసి నిశ్చేష్టులయ్యారు. ఎన్ని లక్షల చెట్లు నరికి వుంటే ఇన్ని దుంగలు పట్టుబడ్డాయంటూ తీవ్ర వేదనకు లోనయ్యారు. ఇక పట్టుబడకుండా సరిహద్దులు దాటిన దుంగల పరిమాణం తలచుకుని ఆవేదన చెందారు.

వేంకటేశ్వరస్వామి సెంటిమెంట్‌తో..

'తిరుమలలో శ్రీవారికి గాయమైనపుడు వచ్చిన రక్తంతో ఎర్రచందనం చెట్లు పుట్టాయి. అందుకే శేషాచలంలో తప్ప ప్రపంచంలో మరెక్కడా అవి కనిపించవు' అన్న పవన్ వ్యాఖ్యల వెనుక.. ఎర్రచందనాన్ని వేంకటేశ్వరస్వామితో ముడిపెట్టి ఆ సెంటిమెంట్‌తో కాపాడేందుకు ప్రయత్నించినట్టుగా కనిపిస్తోంది. అందుకనే శేషాచలం అడవుల్లోని పవిత్ర ఎర్రచందనం వృక్షాలను నరకొద్దంటూ స్మగ్లర్లతో పాటు వారికి సహకరించే స్థానికులకు సైతం విజ్ఞప్తి చేయడం అందరినీ ఆకట్టుకుంది.

ఆపరేషన్ కగార్‌ను గుర్తుచేస్తూ..

ఎర్రచందనం వృక్షాల నరికివేత కొనసాగితే ఆపరేషన్ కగార్ తరహాలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి స్మగ్లర్ల తాటతీస్తామని పవన్ హెచ్చరించారు. కూంబింగ్, నిఘా, తనిఖీలు వంటివి పటిష్టంగా చేపట్టాలని, చెట్ల నరికివేతను ఆపడానికి కఠినంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఆదేశాలు, చర్యలు గత టీడీపీ ప్రభుత్వ చర్యలను గుర్తుకు తెస్తున్నాయి.



మామండూరులో మొక్కలను పరిశీలిస్తున్న పవన్



గుంటి మడుగు వాగులోన..

మామండూరు అటవీ గెస్ట్‌హౌస్ నుంచి దాదాపు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండే గుంటి మడుగు వాగు వద్దకు అధికారులతో కలసి పవన్ వెళ్లారు. వాగు ఒడ్డున కూర్చుని, పారే నీటిలో కాళ్లను ఆడిస్తూ ఆహ్లాదంగా గడిపారు. పరిసరాలను ఆసక్తిగా తిలకించారు. వాగుకు రెండువైపులా ఉన్న చెట్ల వివరాలపై ఆరాతీశారు. ఎర్రచందనం స్మగ్లింగ్, స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్‌ఫోర్స్ అటవీ సిబ్బంది కూంబింగ్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గత టీడీపీ పాలనలో ఏం జరిగిందంటే..

2004-2014 నడుమ పదేళ్ల పాటు శేషాచల అడవుల్లో ఎర్రచందనం వృక్షాల నరికివేత ఇష్టారాజ్యంగా సాగింది. ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు స్మగ్లర్లకు కీలకంగా సహకరించారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్ల కోసం చెట్లు నరికేందుకు స్థానికంగా కూలీలను సమకూర్చారు. స్మగ్లర్ల నుంచీ వాటాలు తీసుకుని ఆర్థికంగా బలపడ్డారు. మరికొందరు నేరుగా తామే స్మగ్లర్ల అవతారం ఎత్తారు. వారిలో కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగానూ ఎన్నికయ్యారు. ఎన్నికల్లోనూ స్మగ్లర్ల డబ్బు కీలక పాత్ర పోషించింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో పరిస్థితి మొత్తం మారింది. సీఎం చంద్రబాబు కన్నెర్ర చేయడంతో పోలీసులు స్మగ్లర్లను అరెస్టు చేయడమే కాదు పీడీ యాక్టు ప్రయోగించారు. అందులో కొందరు టీడీపీ నేతలున్నా ప్రభుత్వం ఖాతరు చేయలేదు. టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేశారు. ఐజీ స్థాయి అధికారిని అధిపతిగా నియమించారు. సిబ్బంది సంఖ్యను పెంచి, ఆయుధాలు కూడా అందించారు. అప్పట్లో శేషాచల అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ దెబ్బకు తమిళనాడు నుంచీ కూలీలు రావడం ఆగిపోయింది. ఇపుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీరు సరిగ్గా నాటి ప్రభుత్వ నిర్ణయాలను గుర్తు చేస్తోంది. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం కూడా కఠిన వైఖరి తీసుకుంటోందనే సంకేతాలను ఇస్తోంది.

కళత్తూరును వీడని బురద

● చురుగ్గా సాగుతున్న సహాయక చర్యలు

కేవీబీపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడలో ఇంకా బురద తొలగలేదు. గురువారం ఓళ్లూరు రాయలచెరువు తెగడంతో వచ్చిన నీటి ప్రవాహంతో ఊరంతా బురదమయంగా మారింది. శనివారం ఉదయం నుంచీ డీపీవో సుశీలాదేవి ఆధ్వర్యంలో సహాయక చర్యలు చురుగ్గా సాగుతున్నాయి. ఇళ్లలో పేరుకుపోయిన బురద తీయడానికి ప్రత్యేక కార్మికులను ఏర్పాటు చేశారు. వీధుల్లో బురదను ట్రాక్టర్ల ద్వారా తొలగించి శుభ్ర పరిచారు. డిస్కం ఏఈ మునికుమార్ ఆధ్వర్యంలో విద్యుత్ పునరుద్ధరణకు అధికారులు, సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు. 133 పశువులకువైద్యాధికారి పార్థీబన్ ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ వేశారు. వైద్యాధికారి రామనాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఇంటింటికి రోగ నివారణ మందులను పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. తహసీల్దారు రోశయ్య ఆధ్వర్యంలో పాతపాళెం అరుందతివాడలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.



కళత్తూరు దళితవాడలో మట్టి తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు



నీటితో తేలియాడుతున్న ట్రాక్టర్

■ బురదలోనే వాహనాలు

కళత్తూరు దళితవాడలో సుమారు 20 ట్రాక్టర్లు కొట్టుకుపోయి చెరువు, పొలాల్లో పడ్డాయి. సుమారు 150 ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. ఇవన్నీ బురదలో కూరుకుపోయి పనికిరాకుండా పోయాయి.

వేగంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు8(ఆంధ్రజ్యోతి): కేవీబీ పురం మండలంలో ఓళూరు చెరువు తెగి ముంపునకు గురైన ప్రాంతాల్లో తమ సిబ్బంది యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారని సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ శనివారం చెప్పారు. 'కేవీబీ పురంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మునగడంతో కళత్తూరు, ఎస్ఎల్‌పురం, పిసీకెపురం, రంగయ్యగుంట, రాజులకండ్రిగ, కొటాలమిట్ట తదితర గ్రామాల్లో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. 223 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. దీంతో 2093 (వ్యవసాయ, గృహ, తాగునీటి) సర్వీసులకు సరఫరా ఆగింది. శుక్రవారం రాత్రికి 89 స్తంభాలు, 78 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించి 1353 విద్యుత్ సర్వీసులకు సరఫరా ఇచ్చాం. మిగిలిన సర్వీసులకు శనివారం పూర్తి చేశాం. దీనికోసం రెండు రోజులు శ్రమించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు' అని శివశంకర్ పేర్కొన్నారు.

■ ఈ పొలంలో సాగు చేసేదెట్టా?

రాళ్ల తేలిపోయి, మట్టి కొట్టుకుపోయి, ఇసుక మేట వేసిన ఈ పొలం పాతపాళేనికి చెందిన డిల్లీబాబుది. పొలం ఆనవాళ్లు లేకుండా పోయింది. ఇంకా ఆదెమ్మ రెండు ఎకరాల చెరకు పంట దెబ్బతిని మట్టి, ఇసుక పొలంలో మేట వేసింది. చంద్రారెడ్డి బావి, పొలం మేట వేసి మట్టి చేరిపోయింది. ఆ పొలాల్లో సాగు చేయాలంటే ఎంత ఖర్చవుతుందో చెప్పలేం. సుమారు 800 ఎకరాల వరకు మేట వేసి పొలాలు మొత్తం పనికిరాకుండాపోయాయి.



మద్యంతాగి బడికొచ్చిన టీచర్ సస్పెన్షన్

తిరుపతి(విద్య), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ఏర్పేడు మండలం ఆముదూరు ఎంపీపీఎస్ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లారు. పల్లం హరిజనవాడ ఎంపీపీఎస్ పాఠశాలలో పని చేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడు సి.నాగరాజును డిప్యూటేషన్‌పై అక్కడికి పంపారు. ఆయన మద్యం తాగి విధులకు హాజరవ్వడమే కాకుండా పాఠశాల ఆవరణలో పడిపోయారు. తరగతిలో ఆయన తీరుతో విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ విషయంపై విచారణ జరపాలని ఎంఈవోను డీఈవో ఆదేశించారు. నివేదిక ఆధారంగా నాగరాజును విధుల నుంచి తొలగిస్తున్నట్టు డీఈవో తెలిపారు.







ఎంత పని చేశావు తల్లీ..!

● భర్త మందలించాడని ఇద్దరు బిడ్డలు సహా తల్లి ఆత్మహత్య
● ఉగ్గుమూడిలో విషాదం



బావిలో మృతదేహాలను వెలికితీస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భర్త మందలిస్తే ఉసురు తీసుకోవాలా? కుటుంబంలో కలహాలుంటే అభం శుభం తెలియని బిడ్డల ప్రాణాన్నీ బలిగొనాలా? ఆవేశంలో ఎంత చేశావు తల్లీ.. అంటూ రోదిస్తున్నారామె కుటుంబీకులు, బంధుమిత్రులు. ఇద్దరు చిన్నారుల సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న వరలక్ష్మి జీవితం విషాదాంతమైంది. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం ఉగ్గుమూడిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఉగ్గుమూడి ఎగువ హరిజనవాడకు చెందిన వరలక్ష్మికి, దిగువ హరిజనవాడకు చెందిన ఉగ్గుముడి మాధవయ్యతో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ప్రశాంత్(2), వర్షిత్(4) పిల్లలు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య చిన్నపాటి వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో వరలక్ష్మి(24)ని భర్త మందలించాడు. దీంతో కలత చెందిన ఆమె శనివారం ఇంట్లో భర్తలేని సమయంలో గ్రామ సమీపంలోని నేలబావి వద్దకు ఇద్దరు బిడ్డలతో వెళ్లింది. మొదట పిల్లలను బావిలో తోసి తానూ దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం నుంచి తల్లీ బిడ్డలు కనిపించకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెదికారు. సాయంత్రం పొలాల్లోకి పనుల నిమిత్తం వెళ్లిన గ్రామస్తులకు నేలబావిలో వర్షిత్ మృతదేహం తేలిఉండటం కనిపించింది. వీరి సమాచారంతో గ్రామస్తులు, బంధువులు అక్కడకు చేరుకుని బావిలో నుంచి తల్లి, బిడ్డల మృతదేహాలను వెలికితీశారు. ఎంత పని చేశావమ్మా వరలక్ష్మీ.. చిన్న బిడ్డలనూ బావిలో తోసి ఆత్మహత్య చేసుకునేందుకు మనసు ఎలా వచ్చిందమ్మా అంటూ గుండెలవిసేలా రోదించారు. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మానాయుడు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తల్లీబిడ్డల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ముసలిమడుగుకు పవన్‌కల్యాణ్

పలమనేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం ఉదయం పలమనేరు సమీపంలోని ముసలిమడుగు కుంకీ ఏనుగుల క్యాంపును సందర్శించనున్నారు.తిరుపతి నుంచి ఉదయం 10.50 గంటలకు ముసలిమడుగులోని కుంకీ ఏనుగుల శిక్షణ శిబిరానికి 10.50 గంటలకు వస్తారు.కుంకీ ఏనుగుల శిబిరాన్ని, గజారామాన్ని, నగరవనాన్ని ప్రారంభిస్తారు.అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడతారు.12.45గంటలకు తిరుగుప్రయాణమవుతారు.

ఎంత పెద్ద పామో..!

తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీ నగర్‌లోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం వద్ద శనివారం 10 అడుగుల కొండచిలువ పట్టుబడింది. స్థానికుల సమాచారంతో టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగి భాస్కర్ నాయుడు ఈ పామును పట్టుకుని దట్టమైన అడవిలో విడిచిపెట్టారు. అలాగే, మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడోమైలు వద్ద సుమారు 15 అడుగుల కొండ చిలువ పట్టుబడింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



కొండచిలువతో భాస్కర్‌నాయుడు



హర్దీప్ సింగ్ పూరి - ఆర్కే రోజా - కుటుంబ సభ్యులతో అర్జున్ - ప్రియ - మాన్య



జస్టిస్ సుధీర్ కుమార్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి ఆర్కే రోజా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే సినీ హీరో అర్జున్, నివేదిత దంపతులు, వారి కుమార్తెలు హీరోయిన్ ఐశ్వర్య, అంజన, నటి ప్రియ, గాయని మాన్య కూడా తిరుమలేశుడ్ని దర్శించుకున్నారు. దర్శనానంతరం హీరో అర్జున్ మీడియాతో మాట్లాడారు.. తాను నిర్మాత, దర్శకుడిగా వ్యవహరించి చిత్రీకరించిన 'సీతా పయణం' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుందన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,075

తలనీలాలు సమర్పించినవారు: 26,535



కుప్పం @ ఇండస్ట్రియల్ హబ్

- రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన
- 22వేలమందికి ఉపాధి అవకాశాలు

హిందాల్కో కంపెనీ శంకుస్థాపన సందర్భంగా ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్ తదితరులు





కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం యువత కలలు పండనున్నాయి.వలసలను ఆపి ఉపాధి అవకాశాలను పుష్కలంగా పెంచే జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఇక్కడకు తరలి వస్తున్నాయి.కుప్పంలో ఏకంగా ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.రూ.2,203 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలతో 22వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించారు. రాబోయే మూడు నెలల కాలంలో రూ.6,630 కోట్లతో మరో 8 పరిశ్రమలు తెస్తామని, వీటి ద్వారా ఏకంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు.శంకుస్థాపన కార్యక్రమంలో కుప్పంనుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్,ఆయా కంపెనీల సీఈవోలు, ఇతర ముఖ్య ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు, అధికార కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలే అధికం

కుప్పంలో ఏర్పాటు కాబోయే 7 పరిశ్రమల్లో వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే అధికం. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో స్థాపించనున్న మదర్ డెయిరీ ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్, గుడుపల్లె మండలం పొగురుపల్లెలో ఏర్పాటు చేయనున్న శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంట్స్ యూనిట్లు వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే. మదర్ డెయిరీ ఫ్రూట్‌పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 41.22 ఎకరాలు, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు చెందిన డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమిల్ ఫీడ్‌కు 47.49 ఎకరాలు, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్‌కు 18.68 ఎకరాలు, ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంటడ్స్‌కు 73.63 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పల్లారపల్లె వద్ద ఏర్పాటు కానున్న అలీప్ పరిశ్రమకు చెందిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ పార్క్ (మహిళా శక్తి భవన్)కోసం 18.7 ఎకరాలు, రామకుప్పం మండలం విజలాపురం వద్ద ఏర్పాటు కానున్న ఈ-రాయిస్ మోటార్స్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 25 ఎకరాలు, హిండాల్కర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రక్షన్ ఫ్యాక్టరీకి 16.3 ఎకరాల కేటాయింపు జరిగింది. ఈ మొత్తం పరిశ్రమల స్థాపనవల్ల ప్రత్యక్షంగా 7,093 మందికి, పరోక్షంగా 15,237 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన	
		డైరెక్ట్	ఇన్‌డైరెక్ట్
అలీప్	26.7	1,000	2,500
మదర్ డెయిరీ	260	850	3,150
ఏస్ ఇంటర్నేషనల్	525	2,000	5,000
ఈ-రాయిస్ మోటార్స్	200	280	130
శ్రీజ మిల్క్	233	850	3,150
హిండాల్కో ఇండస్ట్రీస్	586	613	307
ఎస్వీఎఫ్ సోయా	372.8	1,500	1000

తిరుమలలో నేడు కార్తీక వనభోజనం

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన కార్యక్రమానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఏటా కార్తీకమాసంలో పాపవినాశన మార్గంలోని పార్వేట మండపంలో ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో ఆదివారం ఉదయం మలయప్పస్వామి చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకీపై బయలుదేరి ఊరేగింపుగా పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వనభోజనం కార్యక్రమం జరుగుతుంది. మండపం సమీపాన అటవీప్రాంతంలో ఉన్న భక్తులందరికీ అన్నప్రసాదాలను అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. వనభోజన కార్యక్రమం నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

కల్యాణకట్ట, లడ్డూకౌంటర్ల వద్ద హెల్ప్ డెస్క్‌లు

- అధికారులకు అదనపు ఈవో ఆదేశం



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కల్యాణకట్ట, లడ్డూ కౌంటర్ల వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. పద్మావతి అతిథిగృహంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా గత నెలలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపై చర్చించారు. కాలిబాట మార్గాల్లో ఎస్టేట్, హెల్త్ విభాగాలు తరచూ తనిఖీలు నిర్వహించాలని, దుకాణాల్లో వస్తువుల ధరలను పర్యవేక్షించాలన్నారు. అన్నప్రసాద భవనంలో చేతులకు తొడుగులు ధరించి ప్రసాదాలు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. లగేజీ కౌంటర్ వద్ద భక్తులకు సకాలంలో లగేజీ అందేలా సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఏటీసీ నుంచి అక్టోపస్ సర్కిల్ వరకు క్యూలైన్లలో అన్నప్రసాదం, తాగునీరు అందేలా చూడాలన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా గోపార్క్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి పార్కింగ్ సమస్యల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు సమావేశంలో డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19న స్వర్ణముఖి నదీ హారతులు

శ్రీకాళహస్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నెల 19వ తేదీ బుధవారం స్వర్ణముఖి నదీ హారతులు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, బిల్వ నిమజ్జనం, స్వర్ణముఖి నదీ హారతులు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రాహుకేతు పూజలు మినహా మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



గోదాములో 'ఎర్ర బంగారం'

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్య

మంగళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదాములో ఉండేది 2.6 లక్షల ఎర్రచందనం దుంగలు. వీటి విలువ దాదాపు రూ.పది వేల కోట్లు. ఈ గణాంకాలు తెలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశ్చర్యపోయారు. గోదాములో 'ఎర్ర బంగారం' నిల్వ చేసినట్లుంది అంటూ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన తిరుపతి నగరం తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎర్రచందనం కేంద్ర గోదామును పరిశీలించారు. ఈ దుంగలు ఎంత పటిష్టంగా ఉంటాయో తెలుసుకోవడానికి సుత్తి తీసుకుని కొట్టి పరీక్షించారు. ఏ, బీ, సీ, నాన్ గ్రేడ్‌గా వర్గీకరించిన దుంగలు, బై ప్రొడక్ట్స్‌ను పరిశీలించారు. ఒక చెట్టును రెండునుంచి మూడు దుంగలుగా స్మగ్లర్లు నరుకుతారని అధికారులు తెలిపారు. ఈ లెక్కన శేషాచల కొండల్లో తెలిసి రెండు లక్షల చెట్లను నరికేస్తే.. తెలియకుండా ఇంకెంత నరికేశారోనని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడున్న దుంగలను ఎత్తుకుని వాటి బరువు పరిశీలించారు. గ్లోబల్ టెండర్లు నిర్వహిస్తున్న సమయంలో చూపించేది ఒకటి.. వారికి ఇస్తున్నది మరొకటన్న అపవాదు ఉందని అడగ్గా.. అందుకు అవకాశంలేదని అటవీశాఖ అధికారులు సమాధానమిచ్చారు. దుంగలు పట్టుబడగానే గ్రేడ్లుగా విభజించి నంబరింగ్ చేస్తామని, వాటిని మార్చడం జరగదన్నారు. కొనుగోలుదారులు ఎంపిక చేసుకున్న వాటినే ఇవ్వాలని పవన్ స్పష్టంచేశారు. బైప్రోడక్ట్ తీసుకున్నవారు ఎందుకువినియోగిస్తారు వీటితో ఏం చేస్తారని ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదాములో 5,300 టన్నుల ఎర్రచందనానికి ఏడాదికి దాదాపు పదివేలకోట్లకు గాను రూ.1.28కోట్లు బీమా చేసినట్లు అధికారులు చెప్పారు. దాదాపు 45నిమిషాల పాటు ఎనిమిది గోదాములను చూశారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఓఎస్డీ శివరాంప్రసాద్, సీసీఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మామండూరులో పవన్

- అరుదైన మొక్క నాటిన డిప్యూటీ సీఎం

తిరుపతి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం సందర్శించారు. అడవిలో నాలుగు కిలోమీటర్లపైగా ప్రయాణించారు. ఇందులో రెండు కిలోమీటర్ల మేర నడుస్తూ ప్రతి చెట్టునూ పరిశీలించారు. ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు శేషాచలంలో మాత్రమే కనబడే అరుదైన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాచ్ టవర్ నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వర్ణముఖీ నది ఎక్కడి నుంచి ఉద్భవిస్తుందనే వివరాలూ అడిగారు. మామండూరు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన వేదిక సమీపంలో జీవవైవిధ్యం కలిగిన 61 మొక్కలను ఏర్పాటుచేశారు. ఇందులో అండమాన్ నుంచి తెప్పించిన అండమాన్ సైకస్, సైకస్ స్పీరికా (జామంతి చెట్టు)మొక్కలను నాటి నీరు పోశారు. గాలిబుడగ, చింతచిల్లి, తూరిపూవు ఎర్రగించ గడ్డి, ఆఫ్రికా మహాగని, సముద్ర జడి, సింధూర చెట్టు, గుగ్గిలం, గురివింద వంటి మొక్కలను అక్కడ అధికారులు నాటారు. బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా పిలిచే దీనిని మియావాకి ఫారెస్టుగా మారుతుందని అధికారులు చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ రాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఇతర అటవీ అధికారులు ఉన్నారు. మామండూరుకు పవన్ వస్తున్నారని తెలిసి జనసేన శ్రేణులతో పాటు స్థానిక కూటమి నాయకులు అక్కడకు చేరుకున్నారు. అయితే అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన గేటు లోపలకు మాత్రమే కొందరు నాయకులకు అనుమతించి.. లోపలికి వెళ్లకూడదని ఆంక్షలు పెట్టారు. దీంతో నాయకులు కొంతసేపు వేచివుండి పవన్ రాక ముందే తిరిగి వెళ్లిపోయారు. అభిమానులనూ పోలీసులు అనుమతించలేదు.

'ఎర్ర' స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యం

- స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు... థర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా
- అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం ఆదేశం

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడేలా చర్యలుండాలని స్పష్టం చేశారు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని అధికారులు వివరించారు. 2004 నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలు, 10,450 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదుచేసి 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్జర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.





ఒకే వేదికపై తండ్రీ కొడుకులు

ఒకరు డిప్యూటీ సీఎం పవన్ వ్యక్తిగత కార్యదర్శి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.ఆర్.మధుసూదన్. మరొకరు తిరుపతి అర్బన్ తహసీల్దారు రామచంద్ర. వీరిద్దరూ తండ్రీ కొడుకులు. శనివారం పవన్ పర్యటనలో.. విధి నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో తండ్రి జి.రామచంద్ర.. కుమారుడు మధుసూదన్ ఒకే వేదికపైకి చేరారు. వీరిద్దరితో పవన్‌కల్యాణ్ ఫొటోదిగి అభినందించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

భక్త కనకదాసుకు నివాళి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్తకనకదాసు 538 జయంత్యుత్సవాలు శనివారం కలెక్టరేట్‌లో జరిగాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి, గాయకుడు, రచయిత, సంఘసంస్కర్తగా సమాజంలో నెలకొన్న అనేక దురాచారాలను దూరంచేయడానికి కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, బీసీ సంక్షేమశాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్న, జిల్లా కురబసంఘం నాయకులు పాల్గొన్నారు.



తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

తిరుపతి(నేర విభాగం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పి పోయిన వృద్ధుడిని శనివారం తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీవారి దర్శనార్థం మన్యం జిల్లా పర్వతీపురానికి చెందిన నల్ల గంగునాయుడు(72) డిసెంబరు 28న కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద తప్పిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించగా, సిబ్బంది సీసీటీవీ దృశ్యాలు పరిశీలించారు. ఆయన విష్ణు నివాసం నుంచి బయటకు వెళ్లినట్లు గుర్తించారు. ఆయన ఫొటో, వివరాలను కమాండ్ కంట్రోల్ సిబ్బంది వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సెక్యూరిటీ దేవేంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కాల్ చేసి, ఆ వృద్ధుడు ఆఫీస్ సమీపంలో తిరుగుతున్నట్లు సమాచారమిచ్చారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు నల్ల శివకు తెలియజేయగా, వెంటనే కంట్రోల్ రూమ్ చేరుకొని తమ తండ్రిని తీసుకెళ్లారు. పోలీసు సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

వర్షం నుంచి రక్షణగా..

అలిపిరి కాలిబాటలో ఫైబర్ షీట్లతో పైకప్పు ఏర్పాటు

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలినడకన తిరుమలకు వచ్చే భక్తులకు వర్షం నుంచి ఉపశమనం కల్పించేలా ఫైబర్ షీట్లతో టీటీడీ పైకప్పు ఏర్పాటు చేసింది. సాధారణంగా మొక్కులున్న భక్తులు శ్రీవారిమెట్టు మార్గానికంటే అలిపిరి కాలినడక మార్గాన్నే అధికంగా వినియోగిస్తారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం (ఎన్ఎస్ టెంపుల్) నుంచి మోకాళ్లమెట్టు వరకు రోడ్డు వెంబడే ఉన్న నడకమార్గంలో కొంతభాగం పైకప్పు లేదు. దీంతో ఎండ, వర్షం సమయాల్లో భక్తులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత వేసవిలో ఎండ నుంచి ఉపశమనం కల్పించేలా పైభాగంలో తాత్కాలికంగా రేకులు వేసి పచ్చటి వస్త్రంతో పైకప్పును ఏర్పాటు చేశారు. ఇటీవల భారీ వర్షాలకు తాత్కాలిక పైకప్పు లీకవడంతో భక్తులు తడిచిముద్దయ్యారు. ఈ క్రమంలో తొలిసారిగా దాదాపు కిలోమీటరున్నర దూరం పాటు తెల్లటి ఫైబర్ షీట్లతో పైకప్పును ఏర్పాటు చేశారు.



ఇమామ్ జీవితం ఆదర్శప్రాయం

- ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో సజ్జల

తిరుపతి(జీవకోన), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇమామ్ జీవితం ఆదర్శప్రాయమని, మానవత్వం మరచిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తిరుపతిలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసం దగ్గర ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల బాధ్యత, కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్న వ్యక్తుల్లో ఇమామ్ అరుదైన వారని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ 53 ఏళ్లుగా ఇమామ్ తెలుసునని, తనతో పాటు జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ రాయలసీమ ఉద్యమంలో ఇమామ్ కీలకపాత్ర పోషించారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇమామ్ లాంటి వ్యక్తులు వైసీపీకి అండగా నిలవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ ఇమామ్ అంటే మత గురువు అని, మొదట మిత్రుడిగా పరిచయమై తర్వాత గురువవుతారని అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇమామ్ గొప్పతనాన్ని అందరికీ చాటాలన్నారు. అనంతరం ఇమామ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.



ఇమామ్ ప్రస్థానం గ్రంథావిష్కరణ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అంబటి రాంబాబు, ఆర్కే రోజా, నారాయణస్వామి, ఇమామ్ తదితరులు

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, వేదికపై శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు బాబి, సంగమేశ్వరరావు, మురళీకృష్ణ, రమణారెడ్డి,

నాయుడుపేట టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. శనివారం పట్టణంలోని కె.వంక్షన్ హాల్‌లో శ్రీసిటీ డీఎస్పీ శ్రీనివాసులుతో పోలీసులు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు, ఉత్సవాలు, నదీ స్నానాలు తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఏదైనా సంఘటన జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు సిబ్బందికి అవగాహన కల్పిస్తూ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, నాయుడుపేట సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, మురళీకృష్ణ, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, ఓజిలి, నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ ఎస్‌ఐలు శ్రీకాంత్, ఆదిలక్ష్మి, అజయ్‌కుమార్, కొండప నాయుడు, బ్రహ్మానాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం.. రాములోరి కల్యాణం



సీతారాముల కల్యాణం చేస్తున్న వేదపండితులు

కోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెంలో గల గమళ్లపాళెంలో శనివారం వాకాడు మండలం బాలిరెడ్డి పాళెం గ్రామానికి చెందిన సీతారామధార్మిక సేవాసంస్థ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. ప్రవాస భారతీయులు వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ, లావణ్య, మధుకిరణ్‌రెడ్డి సహకారంతో జిల్లా అర్చక సలహామండలి సభ్యుడు దీవి అనంతబాబు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరేష్, సాయిబాబా, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి విగ్రహం వితరణ



లక్ష్మీదేవి విగ్రహాన్ని ఆలయానికి అందజేస్తున్న దాతలు

గూడూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక అలగనాధస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి హృదయలక్ష్మీదేవి విగ్రహాన్ని దాతలు అందజేశారు. దేవస్థాన చైర్మన్ బత్తిన సుధాకర్ మాట్లాడుతూ స్వామివారికి 25 గ్రాముల బంగారంతో సుమారు రూ.3.15లక్షల ఖర్చుతో తయారు చేసిన విగ్రహాన్ని దాతలు మారంరెడ్డి రాకేష్‌రెడ్డి, శివపూజిత దంపతులు అందజేశారు. కార్యక్రమంలో అర్చకుడు సత్యఅశోక్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు శ్రీశ్రీ రచనల పుస్తకాలు



పవన్ కల్యాణ్‌కు పుస్తకాలను అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీశ్రీ రచనలతో కూడిన పుస్తకాలను అందజేశారు. కలెక్టరేట్‌లో సమావేశానికి డిప్యూటీ సీఎం హాజరయ్యారు. డీఆర్వో నరసింహులుతో కలిసి కలెక్టర్ స్వాగతం పలికారు. పోలీసు జాగిలం పవన్‌కు సెల్యూట్ చేయడంతో తిరిగి ఆయన షేక్ హ్యాండ్ ఇచ్చారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ



ఓలూరు రాయలచెరువు సమీపంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేయిస్తున్న డైరెక్టర్ కె.గురవయ్య

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళ్లూరు రాయల చెరువుకు గండి పడిన కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన చేసినట్లు సదరన్ డిస్కం సీఎండీ లోతేటి శివశంకర్ వెల్లడించారు. కేవీబీపురం 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నీట మునిగిందన్నారు. దీని ఫలితంగా కళత్తూరు, ఎస్‌ఎల్‌పురం, పీసీకేపురం, రంగయ్యగుంట, రాజులకండ్రిగ, కొటాలమిట్ట తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. వరద కారణంగా 223 విద్యుత్ స్తంభాలు, 78 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని చెప్పారు. 2093(వ్యవసాయ, గృహ, తాగునీటి) విద్యుత్ సర్వీసులకు సరఫరా అంతరాయం ఏర్పడిందన్నారు. వరద తగ్గిన ప్రాంతాల్లో శుక్రవారం రాత్రికి 89 విద్యుత్ స్తంభాలు, పాడైన 78 ట్రాన్స్‌ఫార్మర్లు పునరుద్ధరించినట్లు వెల్లడించారు. 1,353 విద్యుత్ సర్వీసులకు సరఫరా ఇచ్చామని తెలిపారు. మిగిలిన సర్వీసులకు శనివారం పూర్తి చేశామని సీఎండీ వెల్లడించారు. రెండు రోజులుగా రాత్రి, పగలు శ్రమించి పనులు చేసిన అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు. విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను టోల్‌ఫ్రీ నంబర్లు 1912 లేదా 1800 425 155333కి కాల్ చేయాలని, లేకపోతే 9133331912కు వాట్సప్ ద్వారా సమాచారం తెలుపవచ్చుని అన్నారు.

అనుమానాస్పద స్థితిలో సత్యవేడువాసి మృతి



మృతి చెందిన చంద్రశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్న మాల ఫ్లైఓవర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో సత్యవేడువాసి చంద్రశేఖర్(46) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... సత్యవేడు ప్రాంతంలోని మదనపాళెం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఓ ప్రైవేట్ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 5వ తేదీ ఇంటి నుంచి అలిగి వచ్చేశాడు. శనివారం ఉదయం ఫ్లైఓవర్ కింద మృతి చెంది ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగిన్నట్లు పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలంలో మద్యం బాటిల్, పురుగులమందు సీసా లభ్యమైంది. మృతడు తన కుమారుడి ఫోన్ నెంబరు కాగితం మీద రాసి సంచిలో పెట్టుకొని ఉండటంతో కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ ధర్మ తెలిపారు.



టిప్పర్ల రాకపోకలతో గుంతలు పడి, కంకర తేలిపోయిన రోడ్డు

కంకరతేలి... గుంతలు పడి..!

గ్రావెల్ టిప్పర్ల రాకపోకలతో రూపు కోల్పోయిన కట్టువపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డు

దొరవారిసత్రం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలంలోని కట్టువపల్లి ఆర్‌అండ్‌బీ రహదారి గ్రావెల్ టిప్పర్ల రాకపోకలతో అధ్వానంగా మారిపోయింది. జాతీయ రహదారి నుంచి మండలంలోని తూర్పు పల్లెలకు లింక్ రోడ్డు అయిన ఈమార్గంలో కట్టువపల్లితో పాటు పూలతోట, ఆనేగొట్టం, కరటాముడి, ఆనేపూడి, పూలతోటమిట్ట, కొత్తపల్లి, వడ్డికండ్రిగ, పడమట్టికండ్రిగ గ్రామాలు ఉన్నాయి. అలాగే నేలపట్టు, మైలాంగం, కల్లూరు, సింగనాలతత్తూరు. చవటకండ్రిగ, మేలనాలతత్తూరు తదితర గ్రామాలకు అనుసంధానంగా రోడ్లు ఉన్నాయి. ఈ మార్గంలో నిత్యం గ్రావెల్ రవాణ చేసే టిప్పర్లు చక్కర్లు కొడుతుండడంతో రోడ్డు రూపు కోల్పోయింది. దారి పొడవునా కంకర తేలిపోగా, కొన్నిచోట్ల పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా దొరవారిసత్రం నుంచి పూలతోటమిట్ట వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణం నరకంగా మారింది. గ్రావెల్ టిప్పర్లు ఓవర్ లోడుతో రాకపోకలు సాగించడం వల్లే రోడ్డు దెబ్బతిందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి రూపు కోల్పోయిన రోడ్డును బాగు చేయడమే కాకుండా, ఈ మార్గంలో గ్రావెల్ రవాణాను నియంత్రించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేర్నాడు - వేనాడు రోడ్డుకు అనుమతివ్వండి

డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే విజయశ్రీ వినతి



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం పేర్నాడు, తడ మండలం వేనాడు మధ్య రోడ్డు నిర్మానానికి అనుమతి మంజూరు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విన్నవించారు. శనివారం తిరుపతి పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎంను ఎమ్మెల్యే కలిశారు. పులికాట్ పరివాహక ప్రాంతంలో ఉన్న పేర్నాడు, వేనాడు రోడ్ల నిర్మాణానికి అటవీశాఖ అనుమతించకపోవడంతో సరైన దారిలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే దొరవారిసత్రం మండలం మీజూరు వద్ద చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి ఇటువంటి అటవీశాఖ ఆంక్షలే అడ్డుగా ఉన్నాయని చెప్పారు. వీటికి అనుమతులు మంజూరు చేస్తే సుమారు 5వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటికి ఇబ్బందులు తొలగుతాయన్నారు. స్పందించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ సమస్యను పరిష్కారించాలంటూ ఇదివరకే సంబంధిత అధికారులను ఆదేశించామని, వీలైనంత త్వరలోనే పూర్తిస్థాయి అనుమతులు మంజూరవుతాయని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో షిఫ్ట్ ఆపరేటర్‌కు గాయాలు

వెంకటగిరి, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలకేంద్ర వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న హుమయూన్‌కు విద్యుదాఘాతంతో గాయాలయ్యాయి. శనివారం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టేందుకు స్తంభం పైకి ఎక్కిన హుమయూన్‌కు విద్యుదాఘాతం అవడంతో కిందపడి పోయాడు. గాయాలవడంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని పునఃపరిశీలించండి

గూడూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలన చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాలులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటకరణ వల్ల పేద ప్రజలు వైద్య విద్యకు దూరం అవుతారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్, ఫయాజ్, ఇబ్రహీం, కలీల్, హరి, గీతా తదితరులు పాల్గొన్నారు.

మేస్త్రీ ఆత్మహత్య



మృతిచెందిన మహేంద్ర

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది మేస్త్రీ ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఆటోనగర్‌లో చోటు చేసుకుంది. అలిపిరి ఎస్‌ఐ నాగార్జున రెడ్డి వివరాల మేరకు... ప్రకాశం జిల్లా మద్రిపాడి మండలానికి చెందిన మహేంద్ర(38) పనుల కోసం తిరుపతికి వచ్చాడు. మేస్త్రీగా పనిచేస్తూ పూలవానిగుంటలో బాబాయి, పిన్ని ఇంట్లో ఉంటున్నాడు. కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ శుక్రవారం రాత్రి పూలవానిగుంటలో స్నేహితుడి ఇంటికి వచ్చాడు. అక్కడ ఇద్దరూ కలసి మద్యం తాగారు. ఉన్నఫళంగా మిద్దెపైకి వెళ్లి మొదటి అంతస్తు నుంచి దూకాడు. చికిత్స నిమిత్తం ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని తిరుపతి రుయాకు తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



అయ్యప్పస్వామి గ్రామోత్సవంలో భక్తులు

గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీలేవుట్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానం మొదటి వార్షికోత్సవం సందర్భంగా శనివారం గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. వినాయకస్వామి, అయ్యప్పస్వామి, సుబ్రమణ్యస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి మంగళవాయిద్యాలు, అయ్యప్పస్వామి భక్తిగీతాలను ఆలపిస్తూ పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు.

యూనివర్సిటీ టాపర్‌గా జశ్వంత్ కుమార్



గూడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో వైద్యవిద్య అభ్యసిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కుమారుడు జశ్వంత్ కుమార్ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాడు. శనివారం అతనిని పలువురు అభినందనలు తెలిపారు.

విద్యానగర్‌లో కోటి సంతకాల సేకరణ

కోట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మండల పరిధిలోని విద్యానగర్‌లో శనివారం వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం నాయకుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి, నాయకులు రాధాకృష్ణారెడ్డి, షనీల్‌రెడ్డి, నాగూర్‌రెడ్డి, చెంచురాఘవరెడ్డి, విజయసారధిరెడ్డి, పాముల సురేంద్ర, కోటి, నాగార్జున, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రైవేట్ పాఠశాలల బస్సులను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్

నాయుడుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల నిర్వాహకులు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. శనివారం పట్టణంలోని ఏఎల్‌సీఎం క్రీడా మైదానంలో ప్రైవేట్ పాఠశాలల, కళాశాలల బస్సులను మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ అనిల్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన రుకు మస్తాన్, శివనేష్

తడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్-17 విభాగంలో తడ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ రుకు మస్తాన్, వి.శివనేష్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే అండర్-14 విభాగంలో వి.గోకుల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు హరిత, రేవంత్‌కుమార్ తెలిపారు. విద్యార్థులను ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు అభినందించారు.

కష్టపడ్డ వారికే అనుబంధ కమిటీల్లో చోటు

డక్కిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు మండల అనుబంధ కమిటీల్లో ప్రాధాన్యం ఇస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మోపూరు సొసైటీ అధ్యక్షుడు పులి జనార్ధనరెడ్డి, డక్కిలి పట్టణాధ్యక్షుడు చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో అనుబంధ కమిటీల నియామకంపై సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పార్టీలో కష్టపడ్డ వారిని అనుబంధ కమిటీల పదవులకు ఎంపిక చేయడం జరిగిందని, ఈ జాబితాను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అనుమతితో పార్టీ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు.

పైప్‌లైన్ ధ్వంసం: తాగునీరు వృథా

కోట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి వద్ద పైప్‌లైన్ ధ్వంసం కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఫైబర్ నెట్ కేబుల్ కోసం ఎక్స్‌కవేటర్‌తో కాలువ తవ్వుతుండగా పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో సాయంత్రం వరకు తాగునీరు వృథాగా పోయింది.